# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక

అమలాపురం | సంపుటి : 10 సంచిక : 238 | ఎడిటర్ : ఎ. రాజశేఖర్ | శనివారం 18 అక్టోబర్ 2025 | పేజీలు 8 వెల : 5/-

published : Amalapuram Vol:10 Issue : 238 18-10-2025 Editor : A.RAJASEKHAR Pages : 8 Rs: 5/-


## నేడు ఏపి సచివాలయంలో ఉద్యోగుల సమస్యలపై మంత్రుల బృందం సమావేశం

అమరావతి అక్టోబర్ 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఈనెల 18వ తేది శనివారం మధ్యాహ్నం 12గం.లకు ఎపి సచివాలయం 5వ భవనంలో మంత్రుల బృందం(జిఓఎం) ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన అంశాలపై గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో సమావేశం జరగనుంది. ఈసమావేశంలో రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్,రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, సర్వీసెస్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి పియూష్ కుమార్ తదితర అధికారులు పాల్గొనున్నారు. అదే విధంగా గుర్తింపు పొందిందిన ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ఈసమావేశంలో పాల్గొనున్నారు.

## ఆరోజు ఎంతో దూరంలో లేదు

### ప్రధాని మోదీ

- దేశంలో మావోయిస్టు ఉగ్రవాదం తుది దశలో ఉందన్న ప్రధాని మోదీ
- మావోయిజం నుంచి దేశానికి విముక్తి కల్పిస్తా.. ఇది నా గ్యారెంటీ అన్న ప్రధాని
- గత 72 గంటల్లో ఏకంగా 303 మంది నక్సలైట్ల లొంగుబాటు
- ఒకప్పుడు 125 జిల్లాల్లో ఉంటే.. ఇప్పుడు 11 జిల్లాలకే పరిమితం
- గత కాంగ్రెస్ ప్రభుత్వాలపై మోదీ విమర్శలు



న్యూఢిల్లీ అక్టోబర్ 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

దేశంలో మావోయిస్టు ఉగ్రవాదం తుది దశలో ఉందని, ఈ పీడ నుంచి భారతదేశానికి త్వరలోనే పూర్తి విముక్తి కల్పిస్తానని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ధీమా వ్యక్తం చేశారు. ఇది తన వ్యక్తిగత గ్యారెంటీ అని ఆయన స్పష్టం చేశారు. ఢిల్లీలో జరిగిన ఎన్డీటీవీ వరల్డ్ సమ్మిట్‌లో ప్రధాని మాట్లాడుతూ.. దశాబ్దాలుగా దేశ అభివృద్ధికి మావోయిజం పెను శాపంగా మారిందని, ఎందరో పేద గిరిజనులు, రైతులు, గ్రామస్థుల ప్రాణాలను బలిగొందని ఆవేదన వ్యక్తం చేశారు. గత కొన్నేళ్లుగా మావోయిస్టుల ప్రాబల్యం గణనీయంగా తగ్గిపోయిందని, ప్రభావిత ప్రాంతాల్లో అభివృద్ధి శకం మొదలైందని మోదీ తెలిపారు. కేవలం 72 గంటల వ్యవధిలో 303 మంది నక్సలైట్లు లొంగుబాటు కావడమే ఇందుకు

మిగిలింది 2లో..

## 'విశాఖలో గూగుల్' పై ప్రఖ్యాత వాల్ స్ట్రీట్ జర్నల్ కథనం...

### సీఎం చంద్రబాబు స్పందన

- విశాఖపై వాల్ స్ట్రీట్ జర్నల్ కథనంపై సీఎం చంద్రబాబు హర్షం
- గూగుల్ 15 బిలియన్ డాలర్ల ఏఐ డేటా హబ్ ఏర్పాటుపై ప్రస్తావన
- ప్రపంచ టెక్నాలజీ పెట్టుబడుల పటంలో విశాఖకు చోటు
- తన ఆనందాన్ని సోషల్ మీడియా వేదికగా పంచుకున్న సీఎం
- చిన్న రాష్ట్రమైనా పెట్టుబడుల్లో ముందున్నామని వ్యాఖ్య




B4 | Wednesday, October 15, 2025 THE WALL STREET JOURNAL.

TECHNOLOGY & MEDIA WSJ.com/Tech

Google to Invest in AI in India and U.S.

India investment is set for approximately $15 billion over the coming five years

By Kimberley Kao

The investment marks Google's largest in India to date. A Google campus in Bengaluru.

Google has invested more than $4.5 billion in South Carolina. Technology giants such as OpenAI, Meta Platforms, Alphabet and Microsoft are pouring money into chips, data centers and electrical power at levels that surpass even the largest infrastructure booms in history, including the 19th century railroad expansion and the development of modern electrical and fiber-optic grids.

Google has made a series of significant infrastructure investments this year, both domestically and internationally. This month, the company unveiled plans to invest €5 billion, equivalent to $5.78 billion, to expand its data center facility in Belgium.

In September, it revealed an investment of £5 billion, equivalent to $6.67 billion, to expand AI research and data center infrastructure in the U.K.

In January, Microsoft also announced plans to invest $3 billion to scale up its cloud and AI infrastructure in India.

అమరావతి అక్టోబర్ 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం నగరం అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ప్రఖ్యాత 'వాల్ స్ట్రీట్ జర్నల్' పత్రికలో విశాఖ నగరం పేరును ప్రస్తావించడంపై ఆయన తన సంతోషాన్ని పంచుకున్నారు. టెక్నాలజీ పెట్టుబడులకు విశాఖ గ్లోబల్ హబ్‌గా మారుతోందని చెప్పడానికి ఇదే నిదర్శనమని తెలిపారు. వివరాల్లోకి వెళితే, టెక్ దిగ్గజం గూగుల్ సుమారు 15 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడితో విశాఖపట్నంలో ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) డేటా హబ్‌ను ఏర్పాటు చేయనున్న విషయం తెలిసిందే. ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ వాల్ స్ట్రీట్ జర్నల్ ప్రచురించిన కథనంలో విశాఖ పేరు ప్రస్తావించింది.

మిగిలింది 2లో..

## హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ రమేశ్ ప్రమాణ స్వీకారం



అమరావతి అక్టోబర్ 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో న్యాయమూర్తిగా జస్టిస్ దొనాడి రమేశ్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈమేరకు శుక్రవారం హైకోర్టు మొదటి కోర్టు హాల్లో జరిగిన కార్యక్రమంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ జస్టిస్ రమేశ్ చే న్యాయమూర్తిగా ప్రమాణం చేయించారు. గతంలో ఎపి హైకోర్టులో న్యాయమూర్తిగా పనిచేస్తూ జస్టిస్ రమేశ్ అలహాబాద్ హైకోర్టుకు బదిలీ అయ్యారు. మరలా ఎపి హైకోర్టుకు న్యాయమూర్తిగా తిరిగి బదిలీ కావడంతో ఆయనతో చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ న్యాయమూర్తిగా ప్రమాణం చేయించారు. ఈకార్యక్రమంలో పలువురు హైకోర్టు న్యాయమూర్తులు, హైకోర్టు అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్,

మిగిలింది 2లో..

## చెన్నైలోని ఉప రాష్ట్రపతి నివాసానికి బాంబు బెదిరింపు

- డీజీపీ కార్యాలయానికి ఈ-మెయిల్ ద్వారా హెచ్చరిక
- తనిఖీల్లో ఎలాంటి పేలుడు పదార్థాలు లేవని నిర్ధారణ
- నిందితులను గుర్తించేందుకు పోలీసుల దర్యాప్తు



తమిళనాడులో బాంబు బెదిరింపుల పరంపర కొనసాగుతూనే ఉంది. తాజాగా శుక్రవారం చెన్నైలో ఏకంగా ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ నివాసానికి బాంబు బెదిరింపు రావడం తీవ్ర కలకలం సృష్టించింది. రాష్ట్ర డీజీపీ కార్యాలయానికి అందిన ఒక ఈ-మెయిల్‌లో, ఉపరాష్ట్రపతి నివాసంలో బాంబు అమర్చినట్లు ఆగంతుకులు హెచ్చరించారు. ఈ సమాచారం అందుకున్న వెంటనే ఉన్నతాధికారులు అప్రమత్తమయ్యారు. హుటాహుటిన బాంబ్ స్క్వాడ్ బృందాలను, పోలీసు బలగాలను ఉపరాష్ట్రపతి నివాసానికి పంపించారు. భవనం మొత్తాన్ని

మిగిలింది 2లో..

## మైనింగ్ లీజుల్లో వడ్డెర కులస్తులకు..

# 15శాతం రిజర్వేషన్లు

- వడ్డెర్లకు చేయూతనిచ్చేలా కీలక నిర్ణయం తీసుకున్న సీఎం చంద్రబాబు
- సీనరేజి, ప్రీమియంలో 50 శాతం రాయితీ ఇవ్వాలని నిర్ణయం
- రాష్ట్ర ఖనిజ సంపదపై పూర్తిస్థాయి అధ్యయనానికి సీఎం ఆదేశం
- గనుల తవ్వకాలపై శాటిలైట్, డ్రోన్లతో పటిష్ట నిఘా
- ఉచిత ఇసుక విధానం సామాన్యుడికి చేరేలా చూడాలని స్పష్టం
- పెండింగ్‌లో ఉన్న 6,500 మైనింగ్ దరఖాస్తులకు గ్రీన్ సిగ్నల్
- గనుల శాఖ, ఉచిత ఇసుక విధానాలపై సిఎం సమీక్ష





అమరావతి అక్టోబర్ 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

రాష్ట్రంలో వడ్డెర సామాజిక వర్గానికి ఆర్థికంగా చేయూతనిచ్చే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. మైనింగ్ లీజుల కేటాయింపులో వారికి 15 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు అవసరమైన విధానాన్ని తక్షణమే రూపొందించాలని గనుల శాఖ అధికారులను ఆదేశించారు. సీనరేజి, ప్రీమియం వంటి చెల్లింపుల్లో వారికి 50 శాతం రాయితీ ఇవ్వాలని స్పష్టం చేశారు. ఈ అంశంపై పూర్తి ప్రతిపాదనలు

మిగిలింది 2లో..

## 'పి-4 జీరో పావర్టీ'లో పౌరులంతా భాగస్వాములవ్వండి..

- సీఎం చంద్రబాబు పిలుపు
- అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినోత్సవం సందర్భంగా 'ఎక్స్'లో పోస్ట్
- పేదరికం లేని రాష్ట్రమే స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యమన్న చంద్రబాబు
- 16 నెలల్లో లక్ష కోట్ల రూపాయలకు పైగా సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని వెల్లడి
- పేదల ఆత్మగౌరవాన్ని కాపాడటమే నిజమైన నిర్మూలన అని స్పష్టం
- ఎన్టీఆర్ భరోసా, తల్లికి వందనం, స్త్రీ శక్తి వంటి పథకాల గురించి ప్రస్తావన



అమరావతి అక్టోబర్ 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'పి-4 జీరో పావర్టీ' (పేదరిక నిర్మూలన) కార్యక్రమంలో ప్రతి పౌరుడూ భాగస్వామి కావాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం 'అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినోత్సవం' సందర్భంగా, పేదరికం లేని సమాజాన్ని నిర్మించేందుకు అందరం కలిసికట్టుగా కృషి చేద్దామని ఆయన కోరారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో ఒక పోస్ట్ చేశారు. పేదరిక నిర్మూలన అంటే కేవలం పేదలకు ఆర్థిక సాయం అందించడం మాత్రమే కాదని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. వారి ఆత్మగౌరవాన్ని కాపాడటంతో పాటు, ఎదుగుదలకు సమాన అవకాశాలు కల్పించి, అందరితో సమానంగా ముందుకు సాగేలా చేయడమే అసలైన లక్ష్యమని ఆయన స్పష్టం

మిగిలింది 2లో..

## భవిష్యత్తును మార్చేది సంస్కరణలే..

### సీఎం చంద్రబాబు

- సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ క్యాంపైన్ కాంపిటీషన్లో గెలుపొందిన విద్యార్థులను
- కలిసిన ముఖ్యమంత్రి - విజేతలకు సర్టిఫికెట్లు అందచేసిన సీఎం





అమరావతి అక్టోబర్ 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

భవిష్యత్తును మార్చేది సంస్కరణలేనని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా.. సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉందని చెప్పారు. జీఎస్టీ సంస్కరణలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన సూపర్ జీఎస్టీ-సూపర్

మిగిలింది 2లో..

## ఏపీ పర్యటన ఎంతో తృప్తినిచ్చిందని ప్రధాని చెప్పారు

- సీఎం చంద్రబాబు
- ప్రధాని నరేంద్ర మోదీ ఏపీ పర్యటనపై సీఎం చంద్రబాబు సంతృప్తి
- టూర్‌ను విజయవంతం చేసిన మంత్రులు, అధికారులకు అభినందనలు
- కర్నూలు సభ ప్రజలకు బలమైన సందేశాన్ని ఇచ్చిందన్న ముఖ్యమంత్రి
- శ్రీశైలం దర్శనంపై ప్రధాని ఎంతో సంతోషం వ్యక్తం చేశారన్న సీఎం
- 'సూపర్ జీఎస్టీ' కార్యక్రమాలపై పుస్తకం తీసుకురావాలని ఆదేశం



అమరావతి అక్టోబర్ 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిన్న రాష్ట్రంలో జరిపిన పర్యటన అత్యంత విజయవంతం కావడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని పర్యటన ఏర్పాట్లను విజయవంతంగా పూర్తి చేసిన మంత్రులు, అన్ని శాఖల అధికారులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్రంలో పర్యటించడం ఇది నాలుగోసారని చంద్రబాబు గుర్తుచేశారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో జరిగిన ఈ పర్యటనలో భాగంగా, కర్నూలులో ఏర్పాటు చేసిన 'సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్' బహిరంగ సభ దిగ్విజయమైందని, ప్రజల్లోకి మంచి సందేశాన్ని పంపిందని ఆయన

మిగిలింది 2లో..

## పసిడి పరుగు ఆగట్లేదు..

### 2026 నాటికి తులం రూ.1.5 లక్షలు!

- గత ధంతేరాస్ నుంచి ఇప్పటికి 63 శాతం పెరిగిన పసిడి ధర
- అమెరికా-చైనా వాణిజ్య ఉద్రిక్తతలతో పెరుగుతున్న డిమాండ్
- యూఎస్ ఫెడ్ వడ్డీ రేట్లు తగ్గించవచ్చన్న సంకేతాలు
- భారీగా కొనుగోళ్లు జరుపుతున్న కేంద్ర బ్యాంకులు, ఇన్వెస్టర్లు



బంగారం ధర రానున్న రోజుల్లో మరింత పెరిగి సామాన్యులకు షాక్ ఇచ్చేలా ఉంది. 2026 నాటికి 10 గ్రాముల పసిడి ధర రూ.1.5 లక్షల మార్కును తాకే అవకాశం ఉందని ప్రముఖ ఆర్థిక సేవల సంస్థ వెంచురా సెక్యూరిటీస్ ఓ నివేదికలో సంచలన అంచనా వేసింది. శుక్రవారం విడుదల చేసిన ఈ నివేదిక ప్రకారం, అంతర్జాతీయంగా నెలకొన్న సానుకూల పరిస్థితులు పసిడికి భారీగా కలిసొస్తున్నాయి. గత ఏడాది ధంతేరాస్ (2024) నుంచి ఈ ధంతేరాస్ (2025) నాటికి బంగారం ధరలు ఇప్పటికే ఆకాశాన్నంటాయి. రూపాయి పరంగా చూస్తే సుమారు 63 శాతం, డాలర్లలో అయితే 53 శాతం రాబడిని ఇచ్చింది. గతేడాది ధంతేరాస్ నాడు రూ.78,840గా

మిగిలింది 2లో..

జనరల్ న్యూస్
https://epaper.teluguraastram.com
తెలుగురాష్ట్రం దినపత్రిక

## సంపాదకీయం

# స్వర్ణ పిపాస

'బంగారు బొమ్మ రావేమే.. పందిట్లో పెండ్లి జరిగేనే' అని పాత సినిమాలో ఒక పాట. అందమైన ఆడపిల్లలను బంగారుబొమ్మలా ఉందని చెబుతాం. ఒక్కరూపం వర్ణించటానికే కాదు, మంచి మనసున్న వారినీ బంగారంలాంటి మనసున్నోడు అనీ అంటాం. అంతేకాదు విలువైన సంబంధాలనూ బంగారంతోనే పోలుస్తాం. రూపంలో మెరిసేది బంగారమే, దాని విలువలోనూ మెరిసేది బంగారమే. అంటే ఇక మనిషిని కానీ, స్థితిని కానీ, విలువని కానీ ఉన్నతమైనదిగా చెప్పాలన్నపుడు బంగారమే ఉపమానంగా గుర్తుకువస్తుంది. ప్రపంచంలో అందరికీ సంపద రూపంగా కూడా ఉన్నది బంగారమే. అన్నిటికన్నా స్థిరమైన ఆస్తి రూపమూ బంగారం. ఇది డబ్బుకు పర్యాయపదం. పూర్వం రాజుల కాలంలో బంగారు నాణాలే నేటి కరెన్సీలా వాడుకలో ఉండేవి. ఇలాంటి బంగారం కథ చాలా ఏండ్ల క్రితందే. ఇప్పుడు బంగారం మరింత ధగధగ మెరిసిపోతున్నది. దాని మెరుపులకు సామాన్యులు దాని దగ్గరకే పోలేకపోతున్నారు. మార్కెట్‌లో బంగారం ధర చుక్కలను దాటిపోయింది. పది గ్రాములు ఒక లక్షా ముప్పయి వేల రూపాయలకు ఎగబాకింది. దాని విలువను మరింత పెంచుకుంది. ఇది దాని నిజమైన విలువనా! లేక వ్యాపార మాయాజాలపు పర్యవసానమా అనేది ఆర్థిక నిపుణులు తేల్చాలి

ప్రపంచంలో అంతటికన్నా భారతీయులకు బంగారం అంటే తెగమోజు. సంపదకు, ఆస్తి పరత్వానికి చిహ్నంగా ప్రదర్శించడం గమనించవచ్చు. బంగారం లేకుండా పెండ్లి జరగటాన్ని ఇక్కడ మనం ఊహించలేము. బంగారాన్ని అలంకరణగా ఎక్కువగా వాడేది మహిళలే. ఇప్పుడు పురుషులు కూడా వాడుతున్నారు. అతి సామాన్యుల పెండ్లిలో కూడా, కనీసం తాళిబొట్టుకైనా బంగారం కావాల్సిందే. పెండ్లి మాత్రమే కాదు. ఆఖరుకు చనిపోయాక నోట్లో ఇంత బంగారం పెట్టే దహనం చేస్తారు. స్వర్ణం మీద మోహం సామాన్యమైనది కాదు. అందుకే, 'కీర్తి, కాంత, కనకం' వీటిపై మోహంతోనే యుద్ధాలు, రాజ్యాలు, కూలిపోవడాలు, మరణించడాలు అని వ్యవహారంలో అంటూ ఉంటారు. కనకమంటే ఇక్కడ డబ్బే. పదిహేడవ శతాబ్దాపు వేమన కూడా%ొ% 'కులము గల్గువాడు, గోత్రంబు కలవాడు, విద్యచేత విర్రవీగువాడు, పసిడిగలుగు వాని బానిస కొడుకులు' అని అన్నాడు. పసిడి ఏదయినా చేయగలదని దానర్థం. ఇక్కడా పసిడి అంటే ధనమే. పసిడి అందరినీ ఆకర్షిస్తుంది. దేవుళ్లను కూడా వదిలిపెట్టలేదు. హిందూ దేవతలను చూస్తే, అందరూ స్వర్ణకాంతులతో మెరుస్తుంటారు. ఒంటినిండా నగలే ఉంటాయి. పురుషదేవతలూ సమృద్ధిగా స్వర్ణాలంకారాలతోనే దర్శనమిస్తారు. ఇక సంపదలు, ధనం సమకూర్చి పెట్టేందుకు ఒక ప్రత్యేక దేవతయే కలదు.

రామాయణ కథలో వనవాసం చేస్తున్నప్పుడు, పర్ణశాల పరిసరాల్లో సీతకు బంగారు వర్ణంలో మెరిసిపోతున్న లేడిని చూసి, ఎంత అందంగా ఉందో అని, అది కావాలని రామున్ని కోరింది. ఆ కోర్కెనే రామునితో ఎడబాటుకు కారణమైంది. పసిడి వర్ణంపై మక్కువ అలాంటిది. 'పట్టిందల్లా బంగారం' కావాలని కోరుకోవడం ఎప్పుడో గ్రీకు పురాణాల కాలం నుండి ఉందని తెలుస్తుంది. కథలూ కనిపిస్తాయి. అయితే పన్నెండవ శతాబ్ధం నుండి ఉన్న సామెత. షెక్స్‌పియర్ -మార్చెంట్ ఆఫ్ వెన్నిస్‌లో వాడిన వాక్యం 'మెరిసేదంతా బంగారం కాదు' అని. అంటే మెరుస్తున్నట్టు కనపడేది, విలువైనదిగా అనిపించేది ప్రతిదీ బంగారం కాదని చెప్పడం. ఈ సామెత అన్నిటికీ వర్తిస్తుంది. ఇప్పటి రాజకీయాలకు మరీను. చాలామంది పైపై మెరుపులు మాటలు చూసి, విలువైన వారనీ, మంచివాడనీ మోసపోతుంటాం. బంగారమైతే గీటురాయిపై గీసి,అందులో స్వచ్ఛమెంతో చెప్పేయొచ్చు.

కానీ మనుషులు, రాజకీయ నాయకుల గురించి తెలియాలంటే చాలా సమయం పడుతుంది. అప్పుడే హెచ్చరించాడు బద్దెన%ొ%'కనకపు సింహాసనమున, శునకమును కూర్చుండబెట్టి శు భలగమునన్, దొనరగ పట్టముగట్టిన, వెనుకటి గుణమేల మాను వినరా సుమతీ' అనీ. కనకపు సింహాసనమంటే, ఇపుడు మన దేశానికి నాయకులుగా ఎవరినైతే ఎన్నుకుంటామో, వాళ్లు దేశంలోని సంపదను కాపాడే వారేనా? కాదా? సమర్థులా, కాదా! అని తెలుసుకోవాలి. బంగారం అసలైనదో కాదో తెలుసుకోలేకపోతే కొంతమాత్రమే నష్టపోతాం. కానీ దేశ సింహాసనంపై కూర్చోబెట్టే వాళ్లు కల్తీ అయితే దేశ సౌభాగ్యాన్నే కోల్పోతాం. అదలా ఉంచితే, బంగారం ఎంత స్వచ్ఛమైనదో తెలపటానికి మాత్రం మార్కెట్‌లో హాల్‌మార్క్ ఉంది.

కేడిఎం అంటున్నారు. వీటిల్లో కూడా 92 శాతమే అసలైన బంగారం. కొనేటప్పుడు అంతా బంగారమే, అమ్మేటప్పుడే మారిపోతుంటది. ఇంతకుముందు వినలేదు కానీ ఈ మధ్య బంగారం కొనేదానికి కూడా ఒక తిథిని ఏర్పాటు చేశారు. అదే అక్షర తృతీయ రోజు బంగారం కొంటే ఇక భాగ్యమే భాగ్యమని ప్రచారం పెంచేశారు. బంగారమంటే ప్రేమ సామాన్య ప్రజలకే కాదు, కవులకు, పండితులకు కూడా వల్లమాలిన ప్రేమ. రాజుల కాలంలో అయితే కనకాభిషేకాలు చేయించుకునేవారు. స్వర్ణ కంకణాలు తొడిగేవారు. గండపెండేరాలు తొడిగి వారి పాండిత్యాన్ని గుర్తించేవారు. ఇప్పుడది లేదనుకో. బంగారం చేరితే, ధరిస్తే మనిషికి విలువ పెరుగుతుందని అనుకుంటారు. ఎంత బంగారం ఉన్నా మనిషంత, మంచి మనసంత ఏదీ తూగలేదు. బంగారం లాంటి మనిషి ఉండొచ్చు, కానీ మనిషిలాంటి బంగారం ఉండదు.



## టీడీపీ నాయకులు కట్టా నాని జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే అయితాబత్తుల





**అమలాపురం అక్టోబర్ 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

అమలాపురం పట్టణ టిడిపి నాయకులు కట్టా నాని జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే శ్రీ అయితాబత్తుల ఆనందరావు పాల్గొన్నారు. నానికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే వెంట రాష్ట్ర టిడిపి కార్య నిర్వాహక కార్యదర్శి శ్రీ మెట్ల రమణబాబు గారు, అముడా చైర్మన్ శ్రీ అల్లాడ స్వామి నాయుడు గారు, శ్రీమతి విజయలక్ష్మి గారు, కడలి వెంకటేశ్వరరావు గారు, నల్లా స్వామి గారు, జంగా అబ్బాయి వెంకన్న గారు, వాసంశెట్టి చినబాబు గారు, ఆశెట్టి ఆది బాబు గారు, తిక్కిరెడ్డి నేతాజీ గారు, గుత్తుల నాగేశ్వరరావు ఉన్నారు.

## శ్రీవారి లడ్డూ ధరలు
# పెంచుతున్నారా?...
## క్లారిటీ ఇచ్చిన బీఆర్ నాయుడు



**తిరుమల లడ్డూ ధర పెంపుపై వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవం**
**ధరలు పెంచే ఆలోచన లేదని స్పష్టం చేసిన టీటీడీ చైర్మన్**
**తప్పుడు ప్రచారాన్ని తీవ్రంగా ఖండించిన బీఆర్ నాయుడు**
**కొన్ని మీడియా సంస్థలు కావాలనే దుష్ప్రచారం చేస్తున్నాయని ఆరోపణ**
**టీటీడీ, ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీయడమే లక్ష్యమని వ్యాఖ్య**

**తిరుమల, అక్టోబర్ 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

శ్రీవారి లడ్డూ ప్రసాదం ధరను తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పెంచనుందంటూ కొన్ని రోజులుగా ప్రచారంలో ఉన్న వార్తలపై టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు స్పష్టత ఇచ్చారు. లడ్డూ ధరను పెంచే ఆలోచన తమకు ఏమాత్రం లేదని ఆయన తేల్చిచెప్పారు. ఈ మేరకు వస్తున్న వార్తలు పూర్తిగా నిరాధారమైనవని, అవాస్తవమని కొట్టిపారేశారు. కొన్ని బాధ్యతారహిత మీడియా సంస్థలు ఉద్దేశపూర్వకంగానే ఇలాంటి తప్పుడు వార్తలను ప్రసారం చేస్తున్నాయని బీఆర్ నాయుడు ఆరోపించారు. టీటీడీ ప్రతిష్ఠకు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావాలనే దురుద్దేశంతోనే ఈ దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఇలాంటి నిరాధారమైన కథనాలను తాను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. భక్తులు ఎవరూ ఈ వదంతులను నమ్మవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. పవిత్రమైన తిరుపతి లడ్డూ ప్రసాదం ధరను పెంచే ప్రతిపాదన టీటీడీ వద్ద ఎప్పుడూ లేదని, భవిష్యత్తులో కూడా అలాంటి ఆలోచన చేయబోమని బీఆర్ నాయుడు పునరుద్ఘాటించారు. టీటీడీపై బురద చల్లే ప్రయత్నంలో భాగంగానే కొందరు ఇలాంటి అసత్య ప్రచారాలకు పాల్పడుతున్నారని ఆయన వ్యాఖ్యానించారు.

## 20 అంశాల ఆధారంగా
# పనితీరు అంచనా
### మంత్రి సత్యకుమార్

**అమరావతి అక్టోబర్ 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మొదటి 6 నెలల్లో వైద్యారోగ్య శాఖ పరిధిలోని 10 విభాగాల పనితీరును మదింపు చేసేందుకు ఆ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ నిర్ణయించారు. ఈ మేరకు 20 అంశాల ఆధారంగా పనితీరు మదింపు చేపట్టాలని ఆయా విభాగాల అధిపతులకు శుక్రవారం సూచించారు. ఆయా విభాగాల్లో సాధించిన ఫలితాలు, సమస్యల పరిష్కారం, మార్పుల ఆధారంగా పనితీరును అంచనా వేయనున్నారు. ఏప్రిల్ నుంచి సెప్టెంబరు మధ్య కాలానికి సంబంధించి వివిధ విభాగాలు అందించే సమాచారం ఆధారంగా మంత్రి సమీక్షించనున్నారు. 14 వేల ప్రభుత్వ డిస్పెన్సరీలు, ఆస్పత్రులు, పలు ఆరోగ్య పథకాల అమలుకు సంబంధించి వైద్య సేవలు, పథకాల అమలు నాణ్యత, ఫలితాల మదింపుపై దృష్టి సారించి, ఆయా విభాగాల నుంచి పనితీరు అంచనా నివేదికలు కోరారు.

## ఆరోజు ఎంతో దూరంలో లేదు : ప్రధాని మోదీ

నిదర్శనమని అన్నారు. లొంగిపోయిన వారిలో కోటి రూపాయల వరకు రివార్డులు ఉన్న కీలక నేతలు కూడా ఉన్నారని, వారంతా ఇప్పుడు భారత రాజ్యాంగాన్ని విశ్వసించి జనజీవన స్రవంతిలో కలిసేందుకు సిద్ధమయ్యారని వివరించారు. గత కాంగ్రెస్ హయాంలో 'అర్బన్ నక్సల్స్' మావోయిస్టుల ఘోరాలను కప్పిపుచ్చారని ప్రధాని ఆరోపించారు. ఇటీవల మావోయిస్టు బాధితులు ఢిల్లీకి వచ్చి తమ గోడును వినిపించుకోవడానికి ఏడు రోజుల పాటు ప్రయత్నించారని, కొందరు కాళ్లు, చేతులు కోల్పోయిన పేద రైతులు, గిరిజనులు ప్రెస్ కాన్ఫరెన్స్ పెట్టి తమ గొంతును ప్రజలకు చేర్చమని వేడుకున్నారని గుర్తుచేసుకున్నారు. 50 ఏళ్లుగా మావోయిస్టుల దాడుల వల్ల ఎన్నో మారుమూల ప్రాంతాల్లో పాఠశాలలు, ఆసుపత్రులు, కనీస మౌలిక సదుపాయాలు లేకుండా పోయాయని అన్నారు. ఒకప్పుడు దేశంలో 125 జిల్లాలు మావోయిస్టుల ప్రభావంతో సతమతమయ్యేవని, కానీ ఇప్పుడు ఆ సంఖ్య కేవలం 11 జిల్లాలకే పరిమితమైందని మోదీ వెల్లడించారు. వాటిలో కూడా అత్యంత తీవ్రంగా ప్రభావితమైనవి కేవలం మూడు జిల్లాలేనని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం అభివృద్ధి, భద్రతలను సమానంగా ముందుకు తీసుకెళుతోందని, ఒకప్పటి మావోయిస్టుల కంచుకోట బస్తర్‌లో గిరిజనులు ఇప్పుడు 'బస్తర్ ఒలింపిక్స్' నిర్వహిస్తుండటమే సాంస్కృతిక పునరుజ్జీవనానికి నిదర్శనమని చెప్పారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ఈసారి దీపావళి భయం లేకుండా ప్రశాంతంగా జరుగుతుందని ఆయన హామీ ఇచ్చారు. మావోయిస్టు ఉగ్రవాద రహిత భారతావని అతి సమీపంలోనే ఉందని, ఆ రోజు ఎంతో దూరంలో లేదని ప్రధాని మోదీ ధీమా వ్యక్తం చేశారు.

## 'విశాఖలో గూగుల్' పై ప్రఖ్యాత వాల్ స్ట్రీట్ జర్నల్ కథనం... సీఎం చంద్రబాబు స్పందన

ఈ విషయాన్ని ఉటంకిస్తూ చంద్రబాబు సోషల్ మీడియా వేదికగా స్పందించారు. "అంతర్జాతీయ ప్రచురణ సంస్థ అయిన వాల్ స్ట్రీట్ జర్నల్‌లో విశాఖపట్నం పేరు, గూగుల్ డేటా హబ్ వివరాలు చూడటం చాలా ఆనందంగా ఉంది. టెక్నాలజీ పెట్టుబడుల విషయంలో విశాఖ నగరం ప్రపంచ పటంలో తనకంటూ ఒక స్థానాన్ని సంపాదించుకుంటోంది. ఇంతకంటే సంతోషం ఏముంటుంది!" అని చంద్రబాబు తన పోస్టులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా, రాష్ట్ర విభజన తర్వాత ఏర్పడిన చిన్న రాష్ట్రమైనప్పటికీ, ఆంధ్రప్రదేశ్ పెట్టుబడులను ఆకర్షించడంలో ముందుందని చెప్పేందుకు ఆయన (ఏపీకి గూగుల్ రాక) అనే హ్యాష్‌ట్యాగ్‌లను జతచేశారు. ఈ మేరకు వాల్ స్ట్రీట్ జర్నల్ పత్రికా క్లిప్పింగ్ ను కూడా చంద్రబాబు తన ట్వీట్ లో పంచుకున్నారు.

## హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ రమేశ్ ప్రమాణ స్వీకారం

అదనపు సొలిసిటర్ జనరల్ ధనంజయ,అదనపు అడ్వకేట్ జనరల్ ఐ సాంబశివ ప్రతాప్,రిజిస్ట్రార్ జనరల్ వైవిఎస్బిజి పార్థసారథి,హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు కె.చిదంబరం,ఎపి బార్ కౌన్సిల్ అధ్యక్షులు ఎన్.ద్వారకానాథ్ రెడ్డి,పబ్లిక్ ప్రాసిక్యూటర్,పలువురు రిజిస్ట్రార్లు,బార్ అసోసియేషన్,బార్ కౌన్సిల్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## చెన్నైలోని ఉప రాష్ట్రపతి నివాసానికి బాంబు బెదిరింపు

క్షుణ్ణంగా తనిఖీ చేయగా ఎలాంటి పేలుడు పదార్థాలు లభించలేదు. దీంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఇది కేవలం భయభ్రాంతులకు గురిచేసేందుకు చేసిన బూటకపు బెదిరింపు అని నిర్ధారించారు. ఈ-మెయిల్ పంపిన వారిని గుర్తించేందుకు పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఇదిలా ఉండగా, ఢిల్లీలో ఒక విచిత్రమైన ఘటన వెలుగు చూసింది. పరీక్ష రాయడం ఇష్టం లేక ఓ విద్యార్థి ఏకంగా తాను చదువుతున్న స్కూల్‌కే బాంబు బెదిరింపు పంపాడు. నిన్న విశాల్ భారతి పబ్లిక్ స్కూల్‌కు ఈ-మెయిల్ ద్వారా ఈ బెదిరింపు వచ్చింది. పాఠశాల యాజమాన్యం సమాచారంతో పోలీసులు తనిఖీలు చేపట్టగా, అక్కడ కూడా ఎలాంటి ప్రమాదకర వస్తువులు దొరకలేదు. సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు చేసిన పోలీసులు, అదే పాఠశాలలో చదువుతున్న విద్యార్థే ఈ పని చేసినట్లు గుర్తించారు. విచారణలో, పరీక్షలకు భయపడే ఇలా చేశానని ఆ బాలుడు అంగీకరించాడు. దీంతో పోలీసులు అతడిని మందలించి, తల్లిదండ్రులకు అప్పగించారు.

## 15శాతం రిజర్వేషన్లు

సిద్ధం చేసి, తదుపరి కేబినెట్ సమావేశంలో చర్చకు తీసుకురావాలని సూచించారు. శుక్రవారం సచివాలయంలో గనులు, భూగర్భ వనరుల శాఖ, ఉచిత ఇసుక విధానంపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వడ్డెర్లకు లీజులు కేటాయించడమే కాకుండా, వారిని ఎంఎస్ఎంఈలుగా ప్రోత్సహించేలా ప్రస్తుత పాలసీలతో అనుసంధానం చేయాలని దిశానిర్దేశం చేశారు. వెనుకబడిన వర్గాలైన వడ్డెర్లకు ఆర్థిక ప్రయోజనాలు కలిగేలా లీజు కేటాయింపు విధానాన్ని రూపొందించాలని సీఎం స్పష్టం చేశారు. మైనింగ్ లీజుల కేటాయింపుతో పాటు వారు ఎంఎస్ఎంఈలుగా ఎదిగేందుకు కూడా ప్రస్తుతం ఉన్న పాలసీని అనుసంధానించాలని అన్నారు.

**ఉచిత ఇసుకతో ప్రజలకే ప్రయోజనం దక్కాలి**

ఇక, ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుక విధానం ద్వారా ప్రజలందరికీ ప్రయోజనం కలగాలని సీఎం స్పష్టం చేశారు. దీనికి అనుగుణంగా ఉచిత ఇసుక సరఫరాను సమర్థవంతంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. వ్యవస్థలో ఉన్న లోపాలను వినియోగించుకుని దుర్వినియోగం చేసే అవకాశం లేకుండా నిబంధనలు కఠినంగా అమలు చేయాలని సీఎం స్పష్టం చేశారు. ఈ సీజన్ కోసం 66.5 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను నిల్వ చేశామని... ప్రస్తుతం అన్ని స్టాక్ పాయింట్లలోనూ 43 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. దీనిపై సీఎం స్పందిస్తూ చిట్టచివరి వ్యక్తికీ ప్రయోజనం దక్కేలా ఇసుక లభ్యత జరగాలని అన్నారు. ఇసుక లోడింగ్ తో పాటు రవాణాకు అతితక్కువ వ్యయం అయ్యేలా చూడాలని సీఎం సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉచిత ఇసుక లభ్యతపై ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అంతర్రాష్ట్ర సరిహద్దుల్లోని అన్ని రూట్లలో పెట్టిన సీసీ కెమెరాల నిఘాను మరింత పటిష్టం చేయాలని సీఎం సూచించారు. ఆర్టీజీఎస్ ద్వారా ఉచిత పంపిణీ విధానంపై పర్యవేక్షించాలని సీఎం అన్నారు.

**విలువ జోడింపుతోనే అదనపు ఆదాయం**

రాష్ట్రంలో లభ్యం అవుతున్న ఖనిజాల విలువపై సమగ్ర అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు గనుల శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. ఖనిజాలకు విలువ జోడింపుతోనే అదనపు ఆదాయం వస్తుందని సీఎం సూచించారు. మేజర్, మైనర్ మినరల్స్ ద్వారా 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.3320 కోట్ల ఆదాయార్జనను లక్ష్యంగా పెట్టుకున్నట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. గతంతో పోలిస్తే 34 శాతం మేర అదనంగా గనుల శాఖ నుంచి ఆదాయం వచ్చే అవకాశం ఉందని తెలిపారు. మాంగనీస్ లాంటి మేజర్ ఖనిజాల ఉత్పత్తిలో 72 శాతానికి పైగా ఆదాయం వస్తోందని వివరించారు. దీనిపై స్పందించిన సీఎం ఏపీలో ఉన్న మినరల్ వెల్త్ విలువను అంచనా వేయాలని సూచించారు. ఒడిశా లాంటి రాష్ట్రాల్లో వాల్యూ ఎడిషన్ ద్వారా ఎక్కువగా ఆదాయాన్ని పొందుతున్నారని.. రూ.50 వేల కోట్ల ఆదాయం ఖనిజాల నుంచే వస్తోందని సీఎం తెలిపారు. ఏపీలోనూ అందుకు తగిన విజన్ ప్లాన్ తయారు చేసి విలువ జోడిస్తే రూ.20-30 వేల కోట్ల ఆదాయాన్ని ఆర్జించే అవకాశం ఉంటుందని ముఖ్యమంత్రి అన్నారు. పెండింగ్ లో ఉన్న 6500 దరఖాస్తులకు అనుమతులు మంజూరు చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో గనుల తవ్వకాలకు సంబంధించి శాటిలైట్ చిత్రాలు, డ్రోన్ ఆధారిత టెక్నాలజీతో విశ్లేషించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఇచ్చిన పర్మిట్లు, జరిగిన తవ్వకాలు ఎంత అనేది ఎప్పటికప్పుడు విశ్లేషించాలన్నారు. అనలటిక్స్ ను వినియోగించుకుని జరిగిన తవ్వకాలను అంచనా వేయాలన్నారు. బీచ్ శాండ్ మినరల్స్ లాంటి భార ఖనిజాల మైనింగ్ తో పాటు విలువ జోడింపు ద్వారా అధిక ఆదాయం సాధించేందుకు ఆస్కారం ఉంటుందని అన్నారు. అలాగే కడపలో నిర్మించనున్న స్టీల్ ప్లాంట్ కు ముడి ఇనుము ఖనిజం సరఫరా పై కూడా అధ్యయనం చేయాలని సూచించారు. ఈ సమీక్షకు గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఆ శాఖ ఉన్నతాధికారులు ముఖేష్ కుమార్ మీనా, ప్రవీణ్ కుమార్, ఆర్టీజీఎస్ అధికారులు హాజరయ్యారు.

## 'పి-4 జీరో పావర్టీ'లో పౌరులంతా భాగస్వాములవ్వండి..

చేశారు. 'స్వర్ణాంధ్ర విజన్ 2047' ప్రధాన ధ్యేయం కూడా పేదరిక నిర్మూలనేనని, ఆ లక్ష్యాన్ని సాధించేందుకే తమ కూటమి ప్రభుత్వం తొలిరోజు నుంచే పనిచేస్తోందని తెలిపారు. గడిచిన 16 నెలల్లో తమ ప్రభుత్వం లక్ష కోట్ల రూపాయలకు పైగా విలువైన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిందని ముఖ్యమంత్రి వివరించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతినెలా రూ. 2,758 కోట్లతో 'ఎన్టీఆర్ భరోసా పింఛన్లు' అందిస్తున్నామని గుర్తుచేశారు. రాష్ట్రవ్యాప్తంగా 207 'అన్నా క్యాంటీన్లను' పునఃప్రారంభించి, కేవలం రూ. 5కే పేదల ఆకలి తీరుస్తున్నామని పేర్కొన్నారు. 'దీపం 2.0' పథకం ద్వారా పేద మహిళలకు ఏడాదికి 3 వంటగ్యాస్ సిలిండర్లను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. పేద కుటుంబాల పిల్లలు చదువులో రాణించాలనే ఉద్దేశంతో, ఎంతమంది పిల్లలు చదువుకుంటే అంతమందికీ 'తల్లికి వందనం' కింద ఏటా రూ. 15,000 చొప్పున ఆర్థిక సాయం చేస్తున్నామని చంద్రబాబు అన్నారు. 'స్త్రీ శక్తి' పథకంతో మహిళలందరికీ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామన్నారు. అదేవిధంగా, 'అన్నదాత సుఖీభవ' కింద రైతులకు తొలి విడతగా రూ. 7,000 జమ చేశామని, మత్స్యకారులకు రూ. 246 కోట్లు, ఆటో డ్రైవర్లకు రూ. 435 కోట్లు అందించామని ఆయన తన పోస్ట్‌లో వివరించారు.

## భవిష్యత్తును మార్చేది సంస్కరణలే..

సేవింగ్స్ ప్రచారంలో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లోని విజేతలు శుక్రవారం ముఖ్యమంత్రిని రాష్ట్ర సచివాలయంలో కలిశారు. 13 ఉమ్మడి జిల్లాలకు చెందిన 17 మంది విద్యార్థినీ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా విజేతలకు సీఎం చంద్రబాబు సర్టిఫికెట్లను అందించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చిన్నారులతో కాసేపు ముచ్చటించారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన జీఎస్టీ సంస్కరణల వల్ల కలిగే ప్రయోజనాలను అర్థం చేసుకున్నారా..? అని వారిని సీఎం అడిగారు. నిత్యావసరాల్లోని చాలా వస్తువులు సున్నా శాతం, 5 శాతం స్లాబ్ పరిధిలోకి వస్తున్నాయని.. దీని వల్ల చాలా వరకు ధరలు తగ్గుతాయని విద్యార్థులు చెప్పారు. నాటిన కొంత కాలానికి చెట్టు ఫలాలు ఇస్తున్నట్టు... సంస్కరణలను ఇప్పుడు అమలు చేస్తే కొన్ని రోజుల తర్వాత ఆ ఫలితాలు ప్రజలకు అందుతాయని సీఎం వివరించారు. జీఎస్టీ వంటి సంస్కరణలను అర్థం చేసుకుని వాటిపై ఎస్సే రైటింగ్ కాంపిటీషన్లు, పెయింటింగ్, ఉపన్యాస పోటీల్లో పాల్గొనడం... వాటిల్లో విజేతలుగా నిలవడం అభినందించదగ్గ విషయమని ముఖ్యమంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యా శాఖకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు

## ఏపీ పర్యటన ఎంతో తృప్తినిచ్చిందని ప్రధాని చెప్పారు

పేర్కొన్నారు. వివిధ శాఖల అధికారులు పూర్తి సమన్వయంతో పనిచేయడం వల్లే ప్రధాని పర్యటన విజయవంతమైందని సీఎం ప్రశంసించారు. ప్రధాని మోదీ కూడా ఈ పర్యటనను ఎంతో ఆస్వాదించారని, ఏర్పాట్ల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారని చంద్రబాబు వెల్లడించారు. ముఖ్యంగా, శ్రీశైల మల్లికార్జున స్వామివారి దర్శనం తనకు ఎంతో సంతృప్తిని, ఆనందాన్ని ఇచ్చిందని ప్రధాని మోదీ తనతో చెప్పినట్లు ముఖ్యమంత్రి వివరించారు. అదేవిధంగా, రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 'సూపర్ జీఎస్టీ' కార్యక్రమాలపై కూడా ప్రధాని ప్రత్యేకంగా ప్రశంసలు కురిపించారని తెలిపారు. ఈ నేపథ్యంలో, జీఎస్టీపై నెల రోజుల పాటు చేపట్టిన కార్యక్రమాలు, వాటి ఫలితాలపై ఒక సమగ్రమైన పుస్తకాన్ని ప్రచురించాలని అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు.

## పసిడి పరుగు ఆగట్లేదు..

ఉన్న తులం బంగారం ధర, ప్రస్తుతం రూ.1,28,200కు చేరడం గమనార్హం. ఇదే జోరు కొనసాగితే, 2026 నాటికి అంతర్జాతీయ మార్కెట్లో ఔన్సు బంగారం ధర 5000 డాలర్లకు, దేశీయంగా తులం రూ.1,50,000కు చేరుతుందని నివేదిక స్పష్టం చేసింది.

**అంతర్జాతీయ పరిణామాలే కారణమా?**

బంగారం ధరల పెరుగుదలకు అనేక అంతర్జాతీయ అంశాలు దోహదం చేస్తున్నాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గించవచ్చని సంకేతాలివ్వడం, కేంద్ర బ్యాంకులు పెద్ద ఎత్తున బంగారాన్ని కొనుగోలు చేయడం, ఈటీఎఫ్‌లలోకి పెట్టుబడుల ప్రవాహం పెరగడం వంటివి పసిడికి డిమాండ్ పెంచుతున్నాయి. వెంచురా సెక్యూరిటీస్ కమోడిటీస్ హెడ్ ఎన్.ఎస్. రామస్వామి మాట్లాడుతూ, "అమెరికాలో ప్రభుత్వం షట్‌డౌన్‌లో ఉన్నందున ఆర్థిక గణాంకాలు ఆలస్యమవుతున్నాయి. ఈ క్రమంలో, యూఎస్ కార్మిక మార్కెట్‌లో నెలకొన్న ప్రతికూలతల దృష్ట్యా ఫెడ్ ఛైర్మన్ మరోసారి వడ్డీ రేట్లను తగ్గించే అవకాశముందని సంకేతాలిచ్చారు" అని తెలిపారు. మరోవైపు, అమెరికా జాతీయ రుణం 37 ట్రిలియన్ డాలర్లకు చేరడం కూడా ఆ దేశ ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి పెంచుతోందని ఆయన వివరించారు. ఇక చైనా-అమెరికా మధ్య ముదురుతున్న వాణిజ్య యుద్ధం కూడా బంగారం ధరకు రెక్కలు తొడుగుతోంది. అరుదైన భూలోహాల ఎగుమతులపై చైనా ఆంక్షలు విధించగా, చైనా దిగుమతులపై అమెరికా అదనంగా 100 శాతం సుంకం విధించింది. ఈ పరిణామాలతో పెట్టుబడిదారులు సురక్షితమైన పెట్టుబడిగా భావించే బంగారం వైపు మొగ్గుచూపుతున్నారు. ఫలితంగా, గత ఎనిమిది వారాలుగా బంగారం ధరలు పెరుగుతూనే ఉన్నాయి. ధర తగ్గినా కూడా ఇన్వెస్టర్లు దూకుడుగా కొనుగోళ్లు జరుపుతున్నారని నివేదిక పేర్కొంది.

## వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు ఆర్.డి.ఎస్. కిట్లు పంపిణీ



**రౌతులపూడి, అక్టోబర్ 17 (తెలుగురాష్ట్రం విలేఖరి):** రౌతులపూడి మండలంలో వ్యవసాయ శాఖ ద్వారా తయారుచేసిన ఆర్ డి ఎస్ కిట్లను రైతులకు శుక్రవారం అందజేశారు. డిస్ట్రిక్ట్ ప్రాజెక్టు మేనేజర్ జె. ఎలియాజార్ ఆదేశాలు మేరకు రౌతులపూడి మండలంలో ఏఓ ఈశ్వరరావు, ఎమ్.టి. వరలక్ష్మి ఆధ్వర్యంలో రబీ డ్రై స్ప్రేయింగ్ కిట్స్ తయారీ చేయడం జరిగింది. హార్టికల్చర్ క్రాప్స్ లో ఇంటర్ క్రాప్స్ వేయడానికి ఆర్.డి.ఎస్. కిట్స్ తయారీ చేయడం జరగింది. విత్తనం రకాలు జొన్న, మొక్కజొన్న, గంటలూ, ఉలవలు, రాగులు, కొర్రలు, జనుము, మినుము, పెసర, నువ్వులు, ఆకుకూరలు, గోంగూర, తోటకూర, మెంతులు, పాలకూర, ఈ విత్తనాలు రకాలుతో ఆర్.డి.ఎస్. కిట్స్ తయారీ చేయడం చేశారు. యూనిట్ ఇంచార్జ్ పి.వి.వి. సత్యనారాయణ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

## నాయుడుపేట గురుకులాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే విజయశ్రీ



**నాయుడుపేట, అక్టోబర్ 17(తెలుగురాష్ట్రం ప్రతినిధి):** నాయుడుపేట పట్టణంలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలను శుక్రవారం సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల తరగతి గదులు, వంట గదులను సందర్శించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం,వారికి అవసరమైన వసతులు, పాఠశాల ఆవరణలో పారిశుధ్యం తదితర విషయాలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకొని క్రమశిక్షణతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ కు సూచించారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట ఏఎంసీ చైర్మన్, సూళ్లూరుపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జి ఉయ్యాల ప్రవీణ్, నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు అవధానం సుధీర్, పరసా రాజా, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## రావులపాలెం బస్టాండ్ ఆధునీకరణకు పూనుకున్న: బండారు



**రావులపాలెం, అక్టోబర్ 17:( తెలుగు రాష్ట్రం )** రావులపాలెం బస్టాండ్ అభివృద్ధికి చర్యలు ప్రారంభమయ్యాయి. వాడపల్లిలో కొత్త బస్టాండ్ నిర్మాణానికి కూడా కసరత్తులు ప్రారంభమయ్యాయని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. రావులపాలెం క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆర్టీసీ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ రీజనల్ మేనేజర్ రాఘవ కుమార్, డిపో మేనేజర్ జి.వి.వి.ఎన్. కుమార్ ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. వాడపల్లిలో భక్తుల సౌకర్యార్థం బస్టాండ్ నిర్మాణానికి సుమారు మూడు ఎకరాల స్థలం కేటాయించే అంశంపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ భక్తుల రాకపోకలకు అదనపు బస్సులు కేటాయించాలని, వాడపల్లి బస్టాండ్ నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. అలాగే రావులపాలెం బస్టాండ్ ఆధునీకీకరణకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో రావులపాలెం బస్టాండ్ ఎస్.ఎం. మైగపుల గురవయ్య పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవం

### రావులపాలెంలో విద్యా, ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు




**రావులపాలెం, అక్టోబర్ 17 ( తెలుగు రాష్ట్రం ):** సమాజంలో బాలికల సంరక్షణ, హక్కులు, ఆరోగ్యం, విద్య, సామాజిక ఎదుగుదల వంటి అంశాలపై అవగాహన కల్పించడం సానుకూల పరిణామమని మండల విద్యాశాఖాధికారి బి. శ్రీనివాసరాజు అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ భవనంలో మహిళాభివృద్ధి %-% శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో, కొత్తపేట సీడీపీఓ ఎగజ లక్ష్మి ఆదేశాల మేరకు అంగన్వాడీ సూపర్వైజర్ల ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాసరాజు, జడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, ఎఓ మంగతాయారు పాల్గొని బాలికల హక్కుల పరిరక్షణకు భారత రాజ్యాంగం పలు చట్టాలను రూపొందించిందని, వాటిని ప్రభుత్వాలు సమర్థంగా అమలు చేస్తున్నాయని పేర్కొన్నారు. మహిళాభివృద్ధి శాఖ నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలను బాలికలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తదుపరి అంగన్వాడీ సిబ్బంది మండలంలోని 9 ఉన్నత పాఠశాలల విద్యార్థులకు బాల్యవివాహాలు, విద్య, ఆరోగ్యం, భద్రత, టోల్ఫ్రీ నంబర్లు, రుతుస్రావం, వ్యక్తిగత పరిశుభ్రత, అక్రమ రవాణా వంటి అంశాలపై ప్రత్యేక పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు ప్రథమ, ద్వితీయ బహుమతులను అందజేశారు. అలాగే జడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, పొడగట్లపల్లి అంగన్వాడీ కార్యకర్తలు కంసోలేషన్ బహుమతులు ఏర్పాటు చేసి బాలికలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్లు నాగ సత్యవేణి, ఫాతిమా బీబీ, హిమశ్రీ, అలాగే అధిక సంఖ్యలో అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీజేపీ మండల కమిటీ సమావేశం

### ఆత్మనిర్భర్ భారత్ అభియాన్, నూతన జీఎస్టీపై నేతల చర్చ



**రావులపాలెం, అక్టోబర్ 18 ( తెలుగు రాష్ట్రం ):** స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించి దేశ అభివృద్ధికి తోడ్పడాలని బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు. గురువారం బీజేపీ రావులపాలెం మండల కమిటీ సమావేశం మండల అధ్యక్షులు కొవ్వూరి వెంకట కృష్ణారెడ్డి అధ్యక్షతన ఆయన స్వగృహంలో జరిగింది. ఈ సమావేశానికి జిల్లా కార్యవర్గ సభ్యులు నాగిరెడ్డి స్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండలంలోని ఈతకోట గ్రామానికి చెందిన మండవిల్లి సతీష్ బీజేపీలో చేరారు. ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా కొత్తపేట అసెంబ్లీ కో కన్వీనర్ నాగిరెడ్డి స్వామి మాట్లాడుతూ, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో కొనసాగుతున్న ఆత్మనిర్భర్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. స్వదేశీ ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా దేశీయ పరిశ్రమలు బలోపేతమవుతాయని, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. అలాగే కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన జీఎస్టీ ఫలాలు ప్రతి ఒక్కరికి అందేలా అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. జీఎస్టీ 2.0 అమలుతో అన్ని రంగాలకు లాభం చేకూరుతుందని, ప్రజల ప్రయోజనార్థం ఎన్డీఏ ప్రభుత్వం పన్ను స్లాబులను తగ్గించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా జిల్లా మాజీ అధ్యక్షురాలు నందం శ్రీలక్ష్మి, మండల ప్రధాన కార్యదర్శి మంచిగంటి కృష్ణ, మద్దింశెట్టి శ్రీనివాస్, కంకటాల వెంకటరత్నం (నాని), బోర్రా ఆంజనేయులు, బుజ్జి, శ్రీను తదితర నాయకులు పాల్గొన్నారు.

# దీపావళి సామన్లు అమ్మే వారికి అనుమతులు తప్పనిసరి

## సబ్ కలెక్టర్ శుభమ్ నోక్వాల్



**రంపచోడవరం, అక్టోబర్ 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):** రాబోయే దీపావళి పండుగ పురస్కరించుకుని ప్రజల భద్రత, అగ్ని ప్రమాదాల నివారణ మరియు పండుగ సజావుగా, ప్రశాంతంగా జరిగేందుకు తీసుకోవాల్సిన చర్యలపై రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్ ఈరోజు ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రంపచోడవరం, చింతూరు డివిజన్లకు చెందిన తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎస్సైలు, ఫైర్ ఆఫీసర్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. పండుగ సందర్భంగా పాటించాల్సిన నిబంధనలు, అధికారుల బాధ్యతలపై సబ్ కలెక్టర్ కట్టుదిట్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈనెల 20వ తారీకున సోమవారం జరగనున్న దీపావళి పండుగకు దీపావళి సామాన్లు అమ్మే యజమానులు ఆయా మండలాల్లోని తహశీల్దార్ లు అనుమతులు కొరకు దరఖాస్తులు సమర్పించుకునే విధంగా సబ్ కలెక్టర్ సమావేశం నిర్వహించారు. చింతూరు, రంపచోడవరం డివిజన్ లో అనుమతులు లేకుండా దీపావళి సామాన్లు అమ్మిన వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని రంపచోడవరం డివిజన్ లోని ఏడు మండలాల్లో, చింతూరు డివిజన్ లోని నాలుగు మండలాల్లో దీపావళి అమ్మకపు దుకాణాదారులు తప్పకుండా అధికారులు జారీ చేసిన నియమ నిబంధనలు పాటించాలని ఆదేశించారు.దీపావళి అమ్మకపు దుకాణాల్ని పాఠశాలలు, ఆసుపత్రులు, పెట్రోల్ బంకులకు దూరంగా తాసిల్దార్లు నిర్దేశించిన బహిరంగ ప్రదేశాలలో మాత్రమే విక్రయించాలి. దుకాణాలకు మధ్య కనీసం 5 మీటర్ల దూరం పాటించాలని, ఇసుక బకెట్స్,వాటర్ డ్రమ్స్ అందుబాట్లో ఉంచుకోవాలి. వాహనాలు పార్కింగ్ కు సైన్ బోర్డ్స్ పెట్టాలని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం దీపావళి సామాన్లు అమ్మే యజమానులు ఆయా మండలాలలోని తాసిల్దార్లకు దరఖాస్తులు సమర్పించాలని చెప్పారు. సమర్పించిన దరఖాస్తులను పరిశీలించి దీపావళి సామాన్లు అమ్ముకునే విధంగా అనుమతులు మంజూరు చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. దీపావళి పండుగ అయ్యేంతవరకు అగ్నిమాపక అధికారులు సిబ్బంది, పోలీస్ శాఖ అధికారులు, సిబ్బంది అలర్ట్ గా ఉండాలని ఆయన అన్నారు. దీపావళి సామాన్లు అమ్మే ప్రాంతాలలో ముఖ్యంగా సాధ్యమైనంత వరకు అగ్నిమాపక సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆయన ఆదేశించారు.

## ఘనంగా ఈనెల 20న భగవాన్ శ్రీ సత్యసాయి బాబా అవతార దినోత్సవ శోభాయాత్ర

### భక్తి స్ఫూర్తితో సాయి నామస్మరణ-చింతపల్లిలో వైభవంగా ఏర్పాట్లు.




**చింతపల్లి, అక్టోబర్ 17 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):** భగవాన్ శ్రీ సత్యసాయి బాబా అవతార ప్రకటన దినోత్సవాన్ని పురస్కరించుకుని అల్లూరి సీతారామరాజు జిల్లా జీకే వీధి, చింతపల్లి సమితులు సంయుక్తంగా శోభాయాత్రను వైభవంగా నిర్వహించేందుకు సన్నాహాలు పూర్తి చేశాయి. ఈ నెల 20వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం నుండి భక్తి గీతాల నడుమ శోభాయాత్ర ప్రారంభమవుతుంది. అనంతరం రింతాడ వరకు ఊరేగింపు జరుగుతుంది. శోభాయాత్రలో వేదపారాయణం, భజన బృందాల గానాలు, సాయి నామస్మరణ, ఆధ్యాత్మిక ప్రసంగాలు, సాంస్కృతిక కార్యక్రమాలు వంటి కార్యక్రమాలు ప్రధాన ఆకర్షణగా ఉండనున్నాయి. భగవాన్ శ్రీ సత్యసాయి భక్తులు పెద్దఎత్తున పాల్గొనాలని, భక్తిశ్రద్ధలతో ఈ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని సమితి సభ్యులు పిలుపునిచ్చారు. భగవాన్ శ్రీ సత్యసాయి బాబా బోధించిన సేవే పరమధర్మం స్ఫూర్తితో ప్రతి భక్తుడు ఈ ఉత్సవాన్ని ఆత్మీయతతో, సేవా భావంతో జరుపుకోవాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. సమితి సభ్యులు మాట్లాడుతూ ఈ శోభాయాత్ర భగవాన్ శ్రీ సాయి బాబా ఆధ్యాత్మిక సందేశాలను గ్రామ గ్రామానికీ చేర్చడమే లక్ష్యం. ప్రతి భక్తుడు సాయి తత్త్వాన్ని ఆచరించాలని తెలిపారు. ఉత్సవంలో మహాప్రసాద వితరణ, సత్సంగం, భజన కార్యక్రమాలు, సాయి బాబా చిత్ర ప్రదర్శన కూడా నిర్వహించబడనున్నాయి.

## ఆత్రేయపురం తహశీల్దార్ టి. రాజేశ్వరరావుకు డిప్యూటీ కలెక్టర్ పదోన్నతి



**ఆత్రేయపురం, అక్టోబర్ 17( తెలుగు రాష్ట్రం )** ఆత్రేయపురం తహశీల్దార్గా విధులు నిర్వర్తిస్తున్న టి. రాజేశ్వరరావు డిప్యూటీ కలెక్టర్గా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా ఆయనకు సహోద్యోగులు, సిబ్బంది, శుక్రవారం రెవిన్యూ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు ఘనంగా అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ ఆర్.డి. రామచంద్రమూర్తి, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ వై. భాను, కార్యాలయ సిబ్బంది, గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ సర్వేయర్లు, రేషన్ షాపు డీలర్లు తదితరులు రాజేశ్వరరావును పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భం లో రాజేశ్వరరావు మాట్లాడుతూ ః “పదోన్నతి నా వ్యక్తిగత విజయమేగాక, మా మండల రెవెన్యూ సిబ్బంది కృషికి ప్రతిఫలం. ప్రజాసేవలో మరింత నిబద్ధతతో పనిచేస్తానని” అన్నారు. భక్తి, సేవ, క్రమశిక్షణకు ప్రతీకగా నిలిచిన రాజేశ్వరరావు పదోన్నతితో ఆత్రేయపురం రెవెన్యూ కార్యాలయంలో ఆనంద వాతావరణం నెలకొంది.

## వైన్స్ షాపుల అవ్యవస్థపై ఉక్కు పాదం

## హెచ్చరిక ః కరుటూరి నరసింహారావు




**ఆత్రేయపురం, అక్టోబర్ 17 ( తెలుగు రాష్ట్రం ):** కొత్తపేట ఎక్సైజ్ పరిధిలో అనుమతుల లెక్కన కాకుండా వైన్స్ షాపులు ఏర్పాటు అయ్యే విధంగా ఉన్నాయని, వాటిపై చర్యలు చేయడంలో ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కాత్యాయిని నిర్లక్ష్యం చూపుతున్నారనే ఆరోపణతో స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక పార్టీ నాయుకులు కరుటురి నరసింహారావు అందించిన ఫిర్యాదు ప్రకారం, సమీపంలో అనేక షాపుల స్కీం, పరిమితుల్ని ఉల్లంఘించినట్లుగా కనిపించటంతో ఎక్సైజ్ సీ.ఐ. గతంలో పాపందించాల్సిన హెచ్చార్లు ప్రకటించినప్పటికీ పర్యావరణ వాస్తవంపై చర్యలు లేవని ఆరోపించారు. నిన్న సాయంత్రం అధ్యవసాయ ప్రెస్ మీట్ నిర్వహించి షాపులు నిర్దిష్ట టైమ్ ః ఉదయం 10:00 నుంచి రాత్రి 10:00 వరకే తెరవాలని చెప్పినప్పటికీ అనేక స్టోర్లను పర్మిషన్స్ ఒక చోట, షాపు మరో చోట చూపిస్తూ, షాపుల చిరునామాల్ని మార్చి కాలక్షేపం చేయటం కనిపించినట్లు ఫిర్యాదులో పేర్కొండారు. ఫిర్యాదు పరిధి ఈతకోటలోని అత్రేయపురం ఇరిగేషన్ స్థలం దగ్గర కూడా షాపు స్థాపించబడ్డప్పటికీ ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని స్థానికుడు చెప్పారు. ఫిర్యాదు మేరకు మండలాభివృద్ధి అధికారి పి.జి.ఆర్.యస్కు ఆ రోజే పిర్యాదు ఇప్పించిన తర్వాత పంచాయతీ కార్యదర్శి శివప్రసాద్ విచారం చేసి వివరాలు తీసుకున్నారు. వారు షాపు దగ్గరకు వెళ్లి అక్కడున్న సిబ్బందికి కరెంటు బిల్లు, షాపు డోర్ నంబర్లు వంటి పత్రాల వివరణ అడిగినప్పుడు తమవంతు ఆప్యాయత లేకుండా అవమానకరమైన తీరుతో స్పందించారని ఫిర్యాదులో విమర్శించారు.. ఫిర్యాదుదారు కథనం ప్రకారం, పంచాయతీ కార్యదర్శి, మండల అభివృద్ధి అధికారి మరియు డ్రైనేజీ ఏ.ఈ. సంఘ కార్యకర్తలతో సమావేశం జరిపి తక్షణ చర్యలు, నోటీసుల పంపిణీ చేయబడతాయని హామీ ఇచ్చిన తర్వాత అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు తెలిపారు. అన్ని విషయాల సంగతిని పోలీస్ సిబ్బంది కూడా పరిశీలించినట్లు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి స్థానికులు ఎక్సైజ్ సీ.ఐ. గారి ఆచరణలో నిర్లక్ష్యం ఉందో, మామూలు అప్రమత్తతలో ఉన్నారో ప్రజలకు గమనించాలని కోరుతున్నారు. తదేకమైన ఆందోళనలు నిజం అయితే, సంబంధిత శాఖలు తగిన తక్షణ చర్యలు తీసుకుంటాయని బాధ్యతాయుతంగా పిలుపునిచ్చారు. ఫిర్యాదుదారు స్వయంగా ఎవరైనా అధికారులకు తమపై చర్యలు తీసుకోవాలన్నప్పటికీ ప్రజల రక్షణ, న్యాయపరమైన పరిష్కారాల కోసం స్థానం కోరుతూ ఉన్నారని పేర్కొన్నారు.

## శాలివాహన కార్పొరేషన్ చైర్మన్కు ఘన సత్కారం

### రావులపాలెంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు చేతుల మీదుగా సత్కారం



**రావులపాలెం, అక్టోబర్ 17 ( తెలుగు రాష్ట్రం ):** ఆంధ్రప్రదేశ్ శాలివాహన (కుమ్మరి) సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పేరేపి ఈశ్వర్ను కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఘనంగా సత్కరించారు. శుక్రవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో చైర్మన్ పేరేపి ఈశ్వర్ ఎమ్మెల్యే బండారును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు ఆయనకు దుశ్శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. శాలివాహన సంఘ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల బలోపేతానికి తాను పూర్తి స్థాయిలో సహకారం అందిస్తానని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, శాలివాహన సంఘ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

### రావులపాలెం మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ నిలిపివేత



**రావులపాలెం, అక్టోబర్ 18 ( తెలుగు రాష్ట్రం ):** 11 కెవి లైన్ ట్రీ క్లియరెన్స్ పనుల కారణంగా శనివారం మండలంలోని కొమరాజులంక, దేవరపల్లి, కేతరాజుపల్లి గ్రామాలతో పాటు ఈతకోట ప్రాంతంలోని పరిశ్రమలకు ఉదయం 8.00 గంటల నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె. రాంబాబు తెలిపారు. విద్యుత్ లైన్ పనులు సురక్షితంగా పూర్తి చేసుకునేందుకు వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

## వైభవంగా కల్ప వృక్ష వాహన, అశ్వ వాహన సేవలు

### వాడపల్లి బ్రహ్మోత్సవాల్లో స్వామివారి వైభవం

### స్వామి వారిని దర్శించుకుని, అశ్వవాహన సేవలో పాల్గొన్న ఎంపీ హరీష్ మాధుర్

### గోవింద నామస్మరణతో మార్మోగిన వాడపల్లి దివ్య క్షేత్రం







**ఆత్రేయపురం అక్టోబర్ 17( తెలుగు రాష్ట్రం )** కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వర స్వామి వారి 13వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదవ రోజు అయిన శుక్రవారం స్వామి వారు ఉదయం ఉభయ దేవేరులతో కలిసి కల్ప వృక్ష వాహనంపై, రాత్రి కల్కి అవతారంలో అశ్వ వాహనంపై ఊరేగారు. ఉదయం విష్వక్సేన పూజ,పుణ్యాహవచనము, పంచామృత మండపారాధన జరిపారు. అనంతరం శోభాయాత్రగా గోదావరీ నదీ జల సంగ్రహణ జరిపి మహాస్నపనము,లక్షకుంకుమార్చన నిర్వహించారు. అనంతరం ప్రధాన హోమములు,దిగ్దేవతా బలిహరణ,నీరాజన మంత్రపుష్పములు,తీర్థ ప్రసాద వితరణ జరిపారు. ఉదయం శ్రీ స్వామి వారు ఉభయ దేవేరులతో కల్పవృక్ష వాహనాన్ని అధిరోహించి మాడవీధుల్లో ఊరేగి భక్తులకు కన్నులపండుగ గావించారు. సాయంత్రంస్వస్తి వచనము,ప్రధాన హోమములు,శ్రీ మహాలక్ష్మీ మంత్ర పూర్వక మహాలక్ష్మీ హోమము,దిగ్దేవతాబలిహరణ,నీరాజన మంత్రపుష్పములు,తీర్థ ప్రసాద వితరణ జరిపి చూర్ణోత్సవము నిర్వహించారు. రాత్రి స్వామివారు కల్కిఅలంకరణలో అశ్వ వాహనాన్ని అధిరోహించి మాడవీధుల్లో ఊరేగారు. అమలాపురం ఎంపీ హరీష్ మాధుర్ అశ్వ వాహన సేవలో పాల్గొన్నారు. శనివారం జరగబోయే చక్రస్నాన ఏర్పాట్లను పర్యవేక్షించారు. శుక్రవారం రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ అనంత కుమారి, తెదేపా పొలిట్ బ్యూరో సభ్యులు రెడ్డి సుబ్రహ్మణ్యం, జిల్లా జాయింట్ కలెక్టర్ నిశాంతి స్వామి వారిని దర్శించుకున్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా వాడపల్లి లో చేసిన ఫల,పుష్ప అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

జనరల్ న్యూస్
https://epaper.teluguraastram.com
తెలుగురాష్ట్రం దినపత్రిక

## నాయి బ్రాహ్మణ సంఘం కమ్యూనిటీ హాల్ కు శంకుస్థాపన






**అమలాపురం అక్టోబర్ 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
అమలాపురం పట్టణ నాయి బ్రాహ్మణ సంఘం కమ్యూనిటీ హాల్ కు శంకుస్థాపన చేసిన గౌరవ ఎమ్మెల్యే శ్రీ అయితాబత్తుల ఆనందరావు గారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, తిక్కారెడ్డి నేతాజీ, మట్టా మహాలక్ష్మి ప్రభాకర్, పెచ్చెట్టి విజయలక్ష్మి, %=ణూ% ప్రసాద్ , యెడిద శ్రీను, అశెట్టి అదిబాబు, నల్లా స్వామి, కంచిపల్లి అబ్బులు, నాగ మానస, కురచ గోవిందువలవల శివరావు, పుల్లయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు

## ఎస్సీ కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే అయితాబత్తుల





**అమలాపురం అక్టోబర్ 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
అమలాపురం ఈదరపల్లి గ్రామంలో రెండు కోట్ల రూపాయలతో నిర్మితమవుతున్న ఎస్సీ కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణ పనులను పరిశీలించిన గౌరవ ఎమ్మెల్యే శ్రీ అయితాబత్తుల ఆనందరావు గారు. ఈ సందర్భంగా రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, మట్టా మహాలక్ష్మి ప్రభాకర్, పెచ్చెట్టి విజయలక్ష్మి, అశెట్టి అదిబాబు, గోలకోటి చిన్న, గోసంగి ఆనందరావు, కడిమి అర్జున్, పుల్లయ్య నాయుడు తదితరులు ఎమ్మెల్యే గారి వెంట ఉన్నారు

## నడిపూడి వంతెన, అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలన





**అమలాపురం అక్టోబర్ 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
నడిపూడి వంతెన మరియు అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన గౌరవ ఎమ్మెల్యే శ్రీ అయితాబత్తుల ఆనందరావు గారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారి వెంట రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, మట్టా మహాలక్ష్మి ప్రభాకర్, నల్లా స్వామి, పెచ్చెట్టి విజయలక్ష్మి, అశెట్టి అదిబాబు, గోలకోటి చిన్న, నల్లా చిట్టి, పుల్లయ్య నాయుడు, కుంచె రమేష్ తదితరులు ఉన్నారు

## రోడ్డు ప్రమాద మృతుడు కుంటుంబానికి బీమా సొమ్ము మంజూరు పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే అయితాబత్తుల



**అమలాపురం అక్టోబర్ 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
రోడ్డు ప్రమాదంలో మరణించిన పాలగుమ్మి గ్రామానికి చెందిన దేవగుప్తపు వీర వినయ్ కుటుంబ సభ్యులకు మంజూరు కాబడిన తెలుగుదేశం పార్టీ సభ్యత్వ భీమా ఐదు లక్షల రూపాయల మంజూరు పత్రాలను అందజేసిన గౌరవ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు గారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, మట్టా మహాలక్ష్మి ప్రభాకర్, పెచ్చెట్టి విజయలక్ష్మి, పుల్లయ్య నాయుడు, చంటి రాజు, బొక్క శ్రీరామమూర్తి, దొమ్మేటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

## పాలగుమ్మిలో నిర్మితమవుతున్న శ్రీశ్యామలాంబ సమేత చెన్నమల్లేశ్వర స్వామి వారి దేవాలయానికి శంకుస్థాపన





**అమలాపురం అక్టోబర్ 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి**
పాలగుమ్మిలో నిర్మితమవుతున్న శ్రీశ్యామలాంబ సమేత చెన్నమల్లేశ్వర స్వామి వారి దేవాలయానికి శంకుస్థాపన చేసిన గౌరవ ఎమ్మెల్యే ఆనందరావు గారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, అమలాపురం మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమతి అధికారి జయవెంకటలక్ష్మి బాబ్జి, మట్టా మహాలక్ష్మి ప్రభాకర్, పెచ్చెట్టి విజయలక్ష్మి, కుడిపూడి రామలక్ష్మి, అశెట్టి ఆదిబాబు, పుల్లయ్య నాయుడు, చంటి రాజు, బొక్క శ్రీరామమూర్తి, గోలకోటి చిన్న, నల్లా చిట్టి, దొమ్మేటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు

## గృహప్రవేశ కార్యక్రమానికి ఎమ్మెల్యే అయితాబత్తుల హాజరు



**అమలాపురం అక్టోబర్ 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి**
అమలాపురం పట్టణం సావరంలో కర్రి వారి గృహప్రవేశ కార్యక్రమానికి హాజరైన గౌరవ ఎమ్మెల్యే శ్రీ అయితాబత్తుల ఆనందరావు గారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, నల్లా స్వామి, చిక్కాల గణేష్, అశెట్టి ఆదిబాబు, గొల్లకోటి చిన్న, పుల్లయ్య నాయుడు, కుంచె రమేష్, బుడితి రాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు శాశ్వతమైన తరగతి గదులు నిర్మించాలి...

**ఏఐఎస్ఎఫ్, ఏలూరు జిల్లా అధ్యక్షులు డి. శివకుమార్...**



**ఏలూరు, అక్టోబరు 17: తెలుగు రాష్ట్రం ప్రతినిధి.**
స్థానిక కోట దిబ్బ వద్ద గల ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు శాశ్వతమైన తరగతి గదులు నిర్మించడానికి రూ.12.6 కోట్లు తక్షణమే అధికారులు మంజూరు చెయ్యాలని ఏఐఎస్ఎఫ్ ఏలూరు జిల్లా అధ్యక్షులు డి. శివ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు.విద్యారంగ సమస్యల పరిష్కారానికై ఈనెల 22 నుండి నవంబర్ 12 వరకు జరగబోయే ఏఐఎస్ఎఫ్ బస్సు యాత్ర జరుగుతున్న సందర్భంగా శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో విద్యార్థులతో కలిసి బస్సు యాత్ర గోడ పత్రికలను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ డిగ్రీ విద్యార్థులు చదువుకోవడానికి నేటికి కూడా తరగతి గదులు లేకపోవడంతో చెట్ల కింద కూర్చొని చదువుకోవాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను పరిష్కరించి విద్యారంగాన్ని మెరుగు పరచాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ ఏలూరు నాయకులు సిద్దు,కృష్ణ, మేఘన,కీర్తన, సుభాష్,మహేష్ విద్యార్థులు పాల్గొన్నారు.

## బహుళ ప్రయోజన భవనం ప్రారంభం ప్రజల సేవలకే అంకితం!

**పర్యాటక ప్రాంత ప్రజలకు మరింత చేరువలో వైద్య సేవలు -గ్రామాభివృద్ధికి కొత్త అడ్డా. రూ. 60 లక్షల వ్యయంతో ఐటిడిఏ ఆధ్వర్యంలో నిర్మాణం- లమ్మసింగి సర్పంచ్ శాంతికుమారి చేతుల మీదుగా ప్రారంభం.**



**చింతపల్లి, అక్టోబర్ 17 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):**
అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పర్యాటక ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య, సామాజిక సేవలు అందించాలనే లక్ష్యంతో పాడేరు ఐటిడిఏ ఆధ్వర్యంలో నిర్మించిన బహుళ ప్రయోజన భవనం శుక్రవారం ప్రారంభమైంది. ప్రధానమంత్రి జన్ మాన్ పథకం కింద రూ. 60 లక్షల వ్యయంతో మల్టీపర్పస్ సెంటర్‌ను నిర్మించారు. లమ్మసింగి పంచాయతీ సర్పంచ్ కొర్ర శాంతికుమారి ఈ సౌకర్యాన్ని ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి స్థానిక ప్రజలు, మహిళా సంఘాలు, గ్రామ పెద్దలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ భవనంలో ప్రజా సమావేశాలు, వైద్య శిబిరాలు, శిశు ఆరోగ్య కార్యక్రమాలు, మహిళా సంఘాల చర్చలు, ప్రభుత్వ అవగాహన కార్యక్రమాలు వంటి అనేక సేవలు నిర్వహించేందుకు అనువుగా సదుపాయాలు కల్పించారు. విశాలమైన ప్రాంగణం, మంచినీటి సౌకర్యం, విద్యుత్ కనెక్షన్, శానిటేషన్ వంటి అన్ని సదుపాయాలతో భవనం సిద్ధమైంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన ఈ బహుళ ప్రయోజన భవనం మనందరికీ ఎంతో ఉపయోగకరమైనది. ప్రజలందరూ దీన్ని సంరక్షించుకోవాలి. గ్రామ ప్రజల సమిష్టి అభివృద్ధికి ఇది వేదికగా నిలవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు రావుల నాగమణి, అంగన్వాడి కార్యకర్త కొర్ర వరహాలమ్మ, అంగన్వాడి సూపర్వైజర్ గౌరీ, మాజీ సర్పంచ్ కొర్ర రఘునాథ్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు దేపూరు గిరిబాబు, పంచాయతీ కార్యదర్శి అప్పలరాజు, పీసా ఉపాధ్యక్షుడు నాగరాజు, నాయకులు సూర్ల కళ్యాణం, నాగరాజు, అంగన్వాడి మరియు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాణాసంచా అమ్మకాలకు ముందస్తు అనుమతులు తప్పనిసరి!

**అక్రమ విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటాం. చింతపల్లి సీఐ వినోద్ బాబు.**




**చింతపల్లి, అక్టోబర్ 17 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):**
దీపావళి పండుగ సమీపిస్తుండగా ప్రజల భద్రత కోసం చింతపల్లి పోలీసులు బాణాసంచా విక్రయాలపై కఠిన నిఘా ఏర్పాటు చేశారు. బాణాసంచా విక్రేతలు తప్పనిసరిగా పోలీసు, రెవెన్యూ శాఖల నుండి ముందస్తు అనుమతులు పొందాల్సిందేనని చింతపల్లి సీఐ ఎం. వినోద్ బాబు అన్నారు. అనుమతులు లేకుండా అక్రమంగా విక్రయాలు నిర్వహిస్తే సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ప్రాణ భద్రతే మా ప్రధాన లక్ష్యం. ప్రభుత్వం నిర్దేశించిన భద్రతా ప్రమాణాలను ప్రతి విక్రేత తప్పనిసరిగా పాటించాలి. అనుమతి పొందిన ప్రదేశాల్లోనే విక్రయాలు జరగాలి. పేలుడు పదార్థాల నిల్వ, రవాణా, విక్రయం మొత్తం చట్టబద్ధంగా ఉండాలి. ఎటువంటి నిర్లక్ష్యం కనబరిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం అని ఆయన స్పష్టం చేశారు. ప్రజలు బాణాసంచా కాల్చేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పిల్లలను పెద్దల పర్యవేక్షణలోనే బాణాసంచా కాల్చనివ్వాలని, బహిరంగ ప్రదేశాల్లో నిర్లక్ష్యంగా కాల్చడం ప్రమాదకరమని హెచ్చరించారు. సీఐ వినోద్ బాబు సూచనల మేరకు చింతపల్లి పోలీసులు ఇప్పటికే మండలవ్యాప్తంగా తనిఖీలు ప్రారంభించారు. లైసెన్స్ లేని దుకాణాలు, గిడ్డంగులను గుర్తించి సీజ్ చేయడానికి ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. ప్రజల భద్రత దృష్ట్యా పోలీసులు ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. భద్రతా నిబంధనలను పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత. చట్టబద్ధంగా అనుమతులు తీసుకుంటే ఎటువంటి ఇబ్బందులు ఉండవు ఆయన స్పష్టం చేశారు.



హైదరాబాదులో ఏ ఐ జి హాస్పిటల్ వైస్ చైర్మన్ పివీఎస్ రాజు ని మర్యాదపూర్వకంగా కలిసిన చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్

**చింతలపూడి న్యూస్, తెలుగు రాష్ట్రం ప్రతినిధి.**

## మహిళలకు, బాలికలకు అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు సృష్టిస్తారు.

- బాలికలు అన్ని రంగాలలో అవకాశాలు అందిపుచ్చుకుని అభివృద్ధి పథంలో అడుగులు ముందుకు వెయ్యాలి.
- అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా బాలికలకు జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి, జిల్లా పరిషత్తు చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు.




**ఏలూరు, అక్టోబరు 17: తెలుగు రాష్ట్రం ప్రతినిధి.**
స్థానిక గవరవరం సెంటెన్స్ మహిళా కళాశాల సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా మహిళాభివృద్ధి మరియు శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవంలో జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి, జిల్లా పరిషత్తు చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ ముఖ్య అతిథిలుగా పాల్గొన్నారు. జ్యోతిప్రజ్వలన చేసి జిల్లా కలెక్టరు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా జిల్లాలో వివిధ పాఠశాలల్లో వివిధ రకాలు పోటీల్లో గెలుపొందిన 14 మంది బాలికలకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలతో జిల్లా కలెక్టరు, జిల్లా పరిషత్తు చైర్ పర్సన్ ఘనంగా సన్మానించారు. లావూరి హిమబిందు తల్లితండ్రులు ఆక్వా చెరువుల్లో పనిచేయటం వలన చదువును మధ్యలో మానేశానని, అంగన్వాడి టీచర్లు ప్రోత్సాహంతో తిరిగి నేను పదవతరగతిలో చేరానని, నేను పోలీసు అధికారి గాని డాక్టరు కావాలి అనుకుంటున్నానని తన విజయగాధను తెలిపింది. దీంతో ఆనందం వ్యక్తం చేస్తూ జిల్లా కలెక్టరు, జిల్లా పరిషత్తు చైర్ పర్సన్ బాలికకు శాలువా కప్పి, ప్రశంసాపత్రం, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. ఇటువంటి వారిని గుర్తిస్తే ఇదే రకంగా తిరిగి బడుల్లో చేర్పించడం జరుగుతుందని, ఇది ఎంతో స్ఫూర్తిదాయకం అని జిల్లా కలెక్టరు అన్నారు. అంతర్జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా మేము సైతం అనే ఫ్లెక్సీ బోర్డుపై జిల్లా కలెక్టరు సంతకం చేశారు, మీ రక్షణ - మా కర్తవ్యం శక్తి యాఫ్ ను ఆవిష్కరించి, ప్రతి మహిళ, ప్రతి బాలిక శక్తి యాఫ్ ను డౌన్లోడ్ చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ విద్య అనే ఆయుధంతో ప్రతి బాలిక ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, నవసమాజానికి స్ఫూర్తి దాయకంగా నిలవాలని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు, రక్షణ కార్యక్రమాలను జిల్లా కలెక్టరు సుదీర్ఘంగా వివరించారు. మహిళలు, రక్షణ కోసం అత్యవసర సమయాల్లో టోల్ ఫ్రీ నెంబర్లు ద్వారా తమ సమస్యలను చెప్పుకోవచ్చునన్నారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం ఎందుకు జరుపుకుంటున్నామని, కొన్ని ప్రశ్నలు వెయ్యగా కొంతమంది బాలికలు చెప్పిన సమాధానంతో జిల్లా కలెక్టరు సంతృప్తిని వ్యక్తం చేస్తూ ఇద్దరికీ నగదు బహుమతులు అందజేశారు. గతంలో భ్రూణ హత్యలు, వరకట్నాలు, ఆడపిల్లలంటే వివక్షత ఎక్కువ ఉండేదని దీనివల్ల మహిళలకు చాలా అన్యాయం జరిగేదని, మారుతున్న కాలంలో చాలా మట్టుకు తగ్గినను అక్కడక్కడ కొన్ని సంఘటన జరుగుతున్నాయని మనమంతా కలిసి రూపుమాపాలన్నారు. బాలికలు అన్ని రంగాల్లోనూ సమాన అవకాశాలు పొందుతూ అభివృద్ధి పథంలో ముందుకు అడుగులు వెయ్యాలని తెలిపారు. బాలికలు విద్యలో రాణించడమే కాకుండా ఆత్మవిశ్వాసంతో ప్రతిరంగంలో ముందుకు సాగాలని సూచించారు. కుటుంబ అభివృద్ధికి మహిళల పాత్ర కీలకమని, మహిళలకు అవకాశాలు కల్పిస్తే సమాజంలోని అన్ని రంగాలలో ఘనవిజయాలు సాధిస్తారని అన్నారు. మహిళలు, బాలికలు స్వీయ రక్షణ నైపుణ్యాలు అలవర్చు కోవాలని పిలుపు నిచ్చారు. బాలికలు భద్రత, రక్షణ, ఆరోగ్యం, పౌష్టికాహారం మీద అవగాహన పెంపొందించు కోవాలని సూచించారు. ప్రతి మహిళ, బాలిక తన ఆత్మస్థైర్యం పెంపొందించుకుని జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవాలని అన్నారు. విద్య, ఉద్యోగం, ఉపాధి అవకాశాలు సాధన ద్వారా సమాజంలో స్థిరమైన స్థానం పొందాలని సూచించారు. జిల్లా పరిషత్తు చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ విద్యతోనే అభివృద్ధి సాధ్యంమని, విద్యార్ధి, విద్యార్థినులు చదువు మీద ప్రత్యేక దృష్టి పెడితేనే వారు సమాజంలో గౌరవంగా జీవించేఅవకాశం ఉంటుందని అన్నారు. స్మార్ట్ఫోన్లు, లాప్టాప్ లు వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. అనుమానాస్పద ఫైళ్ళను ఓపెన్ చేయకూడదని, వ్యక్తిగత వివరాలు పంచుకోవడంలో జాగ్రత్త వహించాలని సూచించారు. ప్రభుత్వం అందుబాటులో ఉంచిన హెల్ప్‌లైన్ నెంబర్లు తెలుసు కోవాలని విజ్ఞప్తి చేశారు. ఆధునిక సమాజంలో ఆడపిల్లలు శారీరక, మానసిక దృఢత్వం అలవర్చు కోవడం అత్యంత అవసరమని తెలిపారు. విద్యతో పాటు ఆత్మరక్షణలో నైపుణ్యం పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో యం. అచ్యుత అంబరీష్, ఐసిడియస్ ఆర్జేడి బి.సుజాతారాణి, పిడి ఏ.శారద, జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి డా.పి.జె. అమృతం, జిల్లా విద్యాశాఖ అధికారి యం.వెంకలక్షమమ్మ, జిల్లా శిశుసంరక్షణ అధికారి డా.సి.హెచ్.సూర్యచక్రవేణి, డిఆర్డీఏ పిడి ఆర్.విజయ రాజు, తహశీల్దారు గాయత్రీదేవి, నోడల్ అధికారి ఏలూరు తులసి, కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ, సిడిపివో లు, కళాశాల అధ్యాపకులు, జిల్లా ఐసిడియస్ ఉద్యోగినులు, అంగన్వాడి సెంటర్ల సిబ్బంది, పట్టణ పాఠశాలలు, కళాశాలలు విద్యార్థినులు,పాల్గొన్నారు.



## సైబర్ నేరాల పట్ల విద్యార్థులు
# అప్రమత్తంగా ఉండాలి!
### చింతపల్లి ఎస్ఐ వెంకటేశ్వరరావు సూచనలు.






**చింతపల్లి, అక్టోబర్ 17 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):** ఆధునిక సాంకేతికత మన జీవితాన్ని సులభతరం చేస్తూనే, సైబర్ నేరాలు కూడా సమాజంలో కొత్త ముప్పుగా పరిణమిస్తున్నాయని చింతపల్లి ఎస్సై వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్%-×ు% ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలి కాని, దాని వల్ల వచ్చే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి. ప్రస్తుతం సైబర్ నేరగాళ్లు బ్యాంకు యాప్‌లు, ఫోన్‌పే, గూగుల్ పే, క్రెడిట్ కార్డు, లాటరీ, ఉద్యోగ ఆఫర్‌లు, షాపింగ్ సైట్లు పేరుతో మోసాలు చేస్తున్నారు. వీటిలో ఏదైనా అనుమానాస్పద లింకులు లేదా సందేశాలు వచ్చినా వాటిని క్లిక్ చేయకుండా వెంటనే తొలగించాలని విద్యార్థులకు సూచించారు. తమ వ్యక్తిగత వివరాలు బ్యాంకు ఖాతా నంబర్లు, ఓటీపీ, ఆధార్, పాన్, పాస్‌వర్డ్‌లు వంటి సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోవద్దు. ఎవరి మాటకు మోసపోకుండా సాంకేతిక అవగాహన పెంచుకోవాలి. ఏదైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి లేదా %ఎఎవతీఎతీఱఎవ.స్త్రశీజ.ఱఅ% వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదు చేయాలి. వేగంగా స్పందిస్తే నష్టాన్ని తగ్గించుకోవచ్చు అని వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. విజయభారతి మాట్లాడుతూ డిజిటల్ యుగంలో విద్యార్థులు టెక్నాలజీతో పాటు బాధ్యత కూడా నేర్చుకోవాలి. సైబర్ సురక్ష అంటే కేవలం హ్యాకింగ్ భయం కాదు, అది మన వ్యక్తిగత గోప్యత, భవిష్యత్తుకు కవచం. ప్రతి విద్యార్థి ఈ అవగాహన కార్యక్రమాల ద్వారా సైబర్ శ్రద్ధను అలవరచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, కళాశాల అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సైబర్ నేరాల నిరోధకతపై పోస్టర్లు ప్రదర్శించి, విద్యార్థుల్లో అవగాహన కలిగించారు.

## వాస్తవాలు తెలుసుకోకుండా పత్రికా ప్రతినిధిపై
# సోషల్ మీడియాలో దుష్ప్రచారం..!
### నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీకి ఫిర్యాదు.




**చింతపల్లి, అక్టోబర్ 17 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):** పత్రికా ప్రతినిధిపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్‌కు పిర్యాదు అందింది. చింతపల్లి మండలం గొందిపాకలు పంచాయతీ చిక్కుడుబట్టి గ్రామానికి చెందిన సాగిన వెంకటరమణ, లోతుగెడ్డ పంచాయతీ లింగాలగుడి గ్రామానికి చెందిన వంతల రాజారావు, అలాగే 6304772340, 9347642044 మొబైల్ నంబర్లను ఉపయోగిస్తున్న వ్యక్తులపై బాధితులు పత్రికా ప్రతినిధి జుర్రా ప్రసాద్, గ్రామ పెద్దలు సాగిన శ్రీరాములు, సాగిన భద్రం లు సంయుక్తంగా ఫిర్యాదు చేశారు. బాధితులు స్థానిక పాత్రికేయులతో మాట్లాడుతూ సాగిన వెంకటరమణ తన భార్య జయ మధురిని మూడు సంవత్సరాల క్రితం పుట్టింటికి పంపించి, ఆ తరువాత మరో మహిళను వివాహం చేసుకునే ప్రయత్నం చేశాడు. ఆ విషయం తెలిసిన జయ మధురి చింతపల్లి పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేయడంతో మేము ఆమె పక్షాన నిలబడ్డాము. దీంతో అతని రెండవ పెళ్లి ఆగిపోయింది. ఆ కక్షతోనే మాపై తప్పుడు ఆరోపణలు చేస్తూ సోషల్ మీడియాలో దుష్ప్రచారం మొదలుపెట్టాడు అని వివరించారు. ఇటీవల పోలీస్ సూచన మేరకు ఇరువర్గాలు మాట్లాడుకునే ప్రయత్నం చేసినప్పటికీ, వెంకటరమణ తమకు తెలియకుండా ఫోటోలు తీసి వాటిని వక్రీకరించి సోషల్ మీడియాలో పంచాడని, తనపై తప్పుడు పిర్యాదు కూడా చేశాడని వారు ఆరోపించారు. గ్రామంలో అడుగు పెట్టినప్పటి నుండి తిరుగు ప్రయాణం అయ్యే వరకు జరిగిన అన్ని సంఘటనలను మేము ఆడియో రికార్డ్ చేశాము. రేపు జరగనున్న విచారణ సందర్భంగా ఆ రికార్డులను పోలీసులకు అందజేస్తాం అని చెప్పారు. వాస్తవాలు తెలుసుకోకుండా సోషల్ మీడియాలో తప్పుడు సమాచారాన్ని ఫార్వర్డ్ చేసిన వారిపైనా పరువు నష్టం దావా వేయనున్నట్లు బాధితులు హెచ్చరించారు.

# చంపుతామని బెదిరింపులపై కేసు నమోదు

**పోలవరం, అక్టోబర్ 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):** పోలవరం మండలంలో ప్రాజెక్టు ముంపు గ్రామం అయినా తూటుకుంటలో చలపాటి శివరామకృష్ణ గేదెలను తీసుకువస్తుండగా మార్గమధ్యలో కొందరు వ్యక్తులు అడ్డుకుని చంపుతామని బెదిరించారు. ఈ ఘటనపై చలపాటి శివ రామకృష్ణ గురువారం పోలవరం ఎస్సై పవన్ కుమార్ కు ఫిర్యాదు చేయగా, బెదిరించిన వ్యక్తి పోసిరావుతో పాటు మరో ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పవన్ కుమార్ తెలిపారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# గుట్టుచప్పుడుగా సత్యవరం రంగురాళ్ల తవ్వకాలు!
## అటవీ శాఖ తాత్కాలిక ఉద్యోగి ప్రధాన సూత్రధారి.. గ్రామస్తుల ఆగ్రహం!









**చింతపల్లి, అక్టోబర్ 17 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):** అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం చౌడుపల్లి పంచాయతీ పరిధిలోని సత్యవరం%-%గూనలంక అటవీ ప్రాంతంలో అక్రమ రంగురాళ్ల తవ్వకాలు గుట్టుచప్పుడుగా సాగుతున్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ అక్రమ తవ్వకాల వెనుక అటవీశాఖ తాత్కాలిక ఉద్యోగి (ప్రొటెక్షన్ వాచర్) చిక్కం జనార్ధన్‌నే కీలక సూత్రధారిగా గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గత ఆదివారం నుంచి గురువారం వరకు ఐదు రోజులపాటు జనార్ధన్ ఆధ్వర్యంలో పోతురాజుగుమ్మలు గ్రామానికి చెందిన ఏడుగురు వ్యక్తులు సత్యవరం అటవీ ప్రాంతంలోని కొండచరియలను తవ్వి రంగురాళ్లను సేకరించినట్లు సమాచారం. సుమారు 15 అడుగుల లోతు వరకు గొయ్యి తవ్వి, మట్టిని తొలగించి రంగురాళ్లను వెలికి తీశారని గ్రామస్తులు తెలిపారు. గ్రామస్థులు తవ్వకాలపై అనుమానం వ్యక్తం చేసి వారిని ప్రశ్నించగా, జనార్ధన్ మరియు అతని బృందం చింతపల్లి అటవీశాఖ అధికారుల అనుమతితోనే తవ్వకాలు చేస్తున్నాం. ఈ ప్రాంతానికి ఎవ్వరూ రావద్దని హెచ్చరించారని గ్రామస్థులు వెల్లడించారు. గ్రామస్తులకు అనుమానం పెరగడంతో వారు గురువారం చింతపల్లి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అయితే, పోలీసులు చేరుకునేలోపే జనార్ధన్ సహా ఏడుగురు వ్యక్తులు తమ వద్ద ఉన్న నాలుగు ద్విచక్ర వాహనాలను వదిలేసి పరారయ్యారు. పోలీసులు, అటవీ అధికారులు పరిశీలనలో తవ్వకాల ప్రదేశం గుహలాగా మారిపోయినట్లు గుర్తించారు. అక్కడ మట్టిగోడలు కూలిన పెచ్చులు, రంగురాళ్ల ముక్కలు, చెట్టు వేరు అవశేషాలు, ఖాళీ ప్లాస్టిక్ సంచులు కనిపించాయి. ఈ ఘటన తవ్వకాల పరిమాణాన్ని, జరిపిన పనుల తీవ్రతను చూపిస్తోంది. శుక్రవారం లోతుగడ్డ అటవీ రేంజ్ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని, తవ్వకాల గోతులను సిమెంట్, ఇసుక, మట్టి కలిపి పూడ్చివేశారు. తవ్వకాలకు కారణమైన వారిపై విచారణ జరుగుతుందని, నివేదిక సిద్ధం చేస్తున్నామని అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా, గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అటవీ శాఖలో పనిచేసే వ్యక్తి స్వయంగా అక్రమ తవ్వకాలు చేస్తే, అటవీ రక్షణ ఎలా సాధ్యం అవుతుంది? గ్రామ గిరిజనులపై తప్పుడు కేసులు పెట్టి, నిజమైన నిందితులను వదిలేయడం అన్యాయం! అని మండిపడ్డారు. కేసులు గిరిజనులపై, లాభాలు మాత్రం ప్రొటెక్షన్ సిబ్బందికి! అటవీ శాఖపై మా నమ్మకం కోల్పోయాం అని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామస్తులు జనార్ధన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అటవీ వనరులు దోపిడీకి గురవుతున్నాయి, అధికారులు కళ్ళు మూస్తున్నారు. అని మండిపడ్డారు.

# నకిలీ మద్యంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి
### జిల్లా ఎస్పీ కార్యాలయంకు పిర్యాదు చేసిన భరత్



**రాజమహేంద్రవరం, అక్టోబరు 17(తెలుగురాష్ట్రం ప్రతినిధి):** అక్రమ లిక్కర్ వ్యాపారంలో రాజమండ్రి టిడిపి నేతల తీరును వైఎస్ఆర్సిపి రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాని భరత్ ఎండగట్టారు. చర్యలకు డిమాండ్ చేసారు. ఈమేరకు శుక్రవారం తూర్పుగోదావరి జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ కార్యాలయానికి చేరుకొని, కొద్దిసేపు భైఠాయించారు. అనంతరం అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఎన్ బిఎం మురళీకృష్ణకు రాజమండ్రిలో అక్రమ లిక్కర్ వ్యాపారంలో టిడిపి నేతల తీరుపై ఫిర్యాదు చేస్తూ, చర్యల కోసం వినతిపత్రం సమర్పించారు. ఈసందర్బంగా మాజీ ఎంపీ భరత్ మీడియాతో మాట్లాడుతూ రాజమండ్రిలో టిడిపి నేతల కనెక్షన్లతో మద్యం అక్రమంగా జరుగుతోందని అయన ఆరోపించారు. అక్రమ మద్యం వ్యాపారాన్ని రెగ్యులరైజ్ చేసే ప్రయత్నం చేస్తున్నారని భరత్ విమర్శించారు ఈ వ్యవహారంలో టిడిపి ఎమ్మెల్యేను భర్తరఫ్ చేయాలని సీఎం చంద్రబాబును డిమాండ్ చేసారు. మద్యం దుకాణదారులతో ఫోన్లో మాట్లాడిన నగర టిడిపి అధ్యక్షుడు మజ్జి రాంబాబు పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. ఏ ఏ బ్రాండ్లకు ఎంతెంత వసూలు చేయాలో నిర్ణయించుకుంటున్నారు ఆ బ్రాండ్లు ఏంటో బయట పెట్టాలన్నారు. అక్రమ మద్యం వ్యాపారాన్ని లిమిటెడ్ కంపెనీగా మార్చేస్తున్నారని ఆయన విమర్శించారు. అక్రమాలకు బైలా రాసుకోవాలని అనుకోవడం దారుణమన్నారు. నకిలీ మద్యం తాగి జిఎస్ఎల్ ఆసుపత్రిలో ముగ్గురు యువకులు మృతి చెందారని, అందుకే రాజమండ్రిలో చలామణి అవుతున్న నకిలీ మద్యంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని భరత్ డిమాండ్ చేసారు. ఎక్సైజ్ అధికారులకు ఎన్ని కేసులు ఇవ్వాలో కూడా టిడిపి నేతల ఆధ్వర్యంలో సిండికేట్ నిర్ణయం చేస్తోందని ఆయన అన్నారు. అందుకే ఎక్సైజ్ అధికారులు ప్రేమేయంపై కూడా విచారణ చేయాలని భరత్ డిమాండ్ చేసారు.

# పోలవరం ప్రాజెక్టు పేరుతో ఆదివాసి సమాజాన్ని ముంచుతున్న ప్రభుత్వాలు
### -మండల అధ్యక్షులు మినప నాగేశ్వరరావు



**కూనవరం, అక్టోబర్ 17 (తెలుగురాష్ట్రం విలేకరి):** ఆదివాసి సంక్షేమ పరిషత్ మండలం అధ్యక్షుడు మినప నాగేశ్వరరావు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభించి 21సంవత్సరాలు గడుస్తున్నా ముంపు మండలాల ప్రజలకు వంటి ఎటువంటి పూర్తి స్థాయిలో భూమికీ భూమి, ఆర్ అండ్ ఆర్. 18సంవత్సరాలు నిండిన యువతీ యువకులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాలేదని అలాగే ప్రతి ఏటా గోదావరి వరదలకు వరి పంటలు, రబ్బి పంటలు, మునుగుతూనే ఉన్నాయి. ప్రతి ఏట ప్రజలు ఇబ్బందులు పడుతూనే ఉన్నారని, ఏ సంవత్సరంలోనైనా పంటలకు నష్టపరిహారం ఇచ్చిందే లేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక, గోదావరి వరదలు కారణంగా ఈ సంవత్సరంలో కూడా ఆరు సార్లు పంట నష్టం జరిగింది. ఈ ప్రభుత్వం అయినా నష్టపరిహారం ఇవ్వాలని, గోదావరి వరదలకు నిత్యవసర సరుకులు, ఒక కుటుంబానికి వచ్చేసి 25 కేజీలు బియ్యం కుటుంబానికి 3000ల చొప్పున ఇస్తామని పిఓ చెప్పడం జరిగిందని, ఇంత వరకు అందలేదన్నారు. ప్రభుత్వ అధికారులు ఏజెన్సీ ప్రాంతంలోని పీసా చట్టాలు అమలు ఉన్న ప్రభుత్వ అధికారులు ఎందుకు గుర్తించడం లేదని అయన ప్రశ్నించారు. ప్రతి గ్రామంలోనూ పిసా తీర్మానాలు, అధికారులకు ముందు ఉండేటట్లు చూసుకోగలరని, ఆదివాసి చట్టాలు జీవోలు కూడా ప్రజలకు అనుకూలంగా పని చేయాలని డిమాండ్ చేశారు.

# దళిత న్యాయమూర్తిపై రాజకీయ కుట్ర
### జిల్లా ఎమ్మార్పీఎస్ ప్రధాన కార్యదర్శి మోదుగు వెంకన్నబాబు



**వి.ఆర్.పురం, అక్టోబర్ 17 (తెలుగురాష్ట్రం విలేఖరి) :** సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై అక్టోబర్ 6న చోటుచేసుకున్న చెప్పు విసరడం ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు కారణమైంది. ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా జరిగిన ఈ చర్యను అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ప్రజలు తీవ్రంగా ఖండించారు. రాజ్యాంగ పరిరక్షణకు, న్యాయవ్యవస్థ గౌరవానికి బలమైన మద్దతు తెలుపుతూ వి.ఆర్.పురం సహా పలు ప్రాంతాల్లో విస్తృత నిరసనలు జరిగాయి. మండల కేంద్రంలోని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీలు, ధర్నాలు చేపట్టారు. దళిత న్యాయమూర్తిపై దాడి రాజకీయ కుట్ర రాజ్యాంగ పరిరక్షణే ప్రజాస్వామ్య రక్షణ వంటి నినాదాలతో వీధులు మార్మోగాయి. సాధారణ ప్రజలు, మహిళా సంఘాలు, యువజన నాయకులు ఈ నిరసనల్లో చురుకుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా నేతలు మాట్లాడుతూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం ప్రజాస్వామ్యానికి ప్రమాదం. రాజ్యాంగం పట్ల గౌరవం ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. వారు ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం శాంతియుత మార్గంలో పోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఏఎస్ఆర్ జిల్లా ఎమ్మార్పీఎస్ ప్రధాన కార్యదర్శి మోదుగు వెంకన్నబాబు మాట్లాడుతూ, "జస్టిస్ బీఆర్ గవాయ్ దళిత వర్గానికి చెందిన వ్యక్తి కావడమే ఈ దురాగతానికి కారణం. ఇది కేవలం వ్యక్తిపై దాడి కాదు, రాజ్యాంగంపై దాడి అని వ్యాఖ్యానించారు. కోర్టులో జరిగిన దాడి చట్టానికి అవమానం,ప్రజాస్వామ్యాన్ని బలహీనపరచే చర్యలపై దేశవ్యాప్తంగా చైతన్యం రావాలి అని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో బింగి విష్ణుమూర్తి, గడ్డం వెంకటేశ్వర్లు, గడ్డం కృపారావు, మోదుగు నాగేశ్వరరావు, గడ్డం సుధాకర్ వంటి ఎమ్మార్పీఎస్ నాయకులతో పాటు మహిళా నాయకులు ములకలపల్లి సంధిపాము ఉషారాణి, ములకలపల్లి వెంకటమ్మ, గడ్డం నాగమణి, గడ్డం కుసుమ తదితరులు పాల్గొని సంఘీభావం తెలిపారు.జిల్లా నాయకులు అల్లూరి సీతారామరాజు వీరుడి త్యాగస్ఫూర్తిని గుర్తుచేసుకుంటూ అన్యాయం ఎదురైనా రాజ్యాంగబద్ధంగా పోరాడాలి, హింసకు తావివ్వకూడదు అని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు సామూహిక చైతన్యం అవసరమని పేర్కొన్నారు.

# కల్తీకి పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపాలి
### ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ ఆదేశాలు



**తాడేపల్లిగూడెం, అక్టోబర్ 17 (తెలుగురాష్ట్రం విలేకరి):** కల్తీ లేని ఆహారాన్ని ప్రజలకు అందించాలని, దుకాణదారులు ఎవరైనా కల్తీకి పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ విప్, శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ హెచ్చరించారు. కల్తీ లేని ఆహారం... ఆరోగ్య పరిరక్షణ అనే అంశానికి సంబందించిన కరపత్రాన్ని స్థానిక క్యాంపు కార్యాలయంలో ఆయన శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ కల్తీ లేనీ ఆహారాన్ని అందిస్తూ ప్రజారోగ్య పరిరక్షణ కోసం అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్లాస్టిక్ రహిత సమాజం నెలకొల్పేందుకు అధికారులు అడుగులు వేయాలని చెప్పారు. ప్లాస్టిక్ వ్యర్థాలను ఎక్కడబడితే అక్కడ వేసే వారికి రూ 10 వేలు జరిమానా విధించాలని అధికారులను ఆదేశించారు. నిబందనలకు విరుద్ధంగా కల్తీ ఆహారానికి పాల్పడే దుకాణదారులను గుర్తించి వారిపై ఉక్కు పాదం మోపాలన్నారు. హెూటల్స్ నిర్వాహకులు ఫుడ్ కలర్స్, టేస్టింగ్ సాల్ట్ వినియోగించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎల్ ఎస్ వి.నాగేశ్వరరావు, ఎస్సై నాగరాజు, నాయకులు పాలూరి వెంకటేశ్వరరావు, మైలవరపు రాజేంద్రప్రసాద్, రామిశెట్టి సురేష్, మట్టా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తెలుగురాష్ట్రం దినపత్రిక

## కొనసాగుతున్న పారిశుద్ధ్య కార్మికుల ఆందోళన



**చింతలపూడి, అక్టోబర్ 17 (తెలుగురాష్ట్రం విలేకరి):**
ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్ సిబ్బంది సమ్మె ఐదో కొనసాగింది. ఏరియా ఆసుపత్రి నందు పనులు నిలిపివేసి పారిశుద్ధ్య కార్మికులు ఆందోళన కొనసాగించారు. దీనితో శానిటేషన్ పనులు నిలిచిపోవడం తో ఎక్కడ చెత్త అక్కడే ఉండిపోయింది. రోగులు తో పాటు వైద్యులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ సందర్భంగా పారిశుద్ధ కార్మికులు మాట్లాడుతూ మూడు రోజులుగా ఆందోళన కొనసాగిస్తున్నామని ఇప్పటి వరకు జిల్లా వైద్య అధికారులు గాని కాంట్రాక్టర్ స్పందించక పోవడం సమ్మె లోకి దిగామన్నారు. పెండింగ్ జీతాలు, పెండింగ్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాధికారి వెంటనే స్పందించి మాకు న్యాయం చేయాలని కోరారు. అధికారులకు కాంట్రాక్టు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వైద్యాధికారులు డి సి హెచ్ ఎస్ నిర్లక్ష్య వైఖరి నశించాలని, వీరికి ప్రత్యామ్నాయంగా మున్సిపల్ కార్మికులతో శానిటేషన్ పనులు చేయించాలని కోరారు. ఏలూరు జిల్లా డిసీహెచ్ఎస్ ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న సూపర్డెంట్ తో పాటు ఆర్ఎంలకు ఆదేశాలు ఇవ్వడం సబబు కాదని అన్నారు. సమస్య పరిష్కారం చేయకుండా ప్రత్యామ్నాయ మార్గాలు వెతకడం సరికాదని ఎవరైనా వచ్చి పనులు చేస్తే అడ్డుకుంటామని ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ హెచ్చరిస్తుందని ఏఐటియుసి జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి తోర్లపాటి బాబు తెలిపారు.

## గేదెల శాల? లేదా సంపద తయారీ కేంద్రమా?






**జీలుగుమిల్లి, అక్టోబర్-17, (తెలుగురాష్ట్రం విలేకరి):**
రాష్ట్రంలో "చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలు" ఆదాయం సృష్టించుకుంటూ స్వచ్ఛంధ్ర అవార్డులు పొందుతుంటే... మండల కేంద్రం జీలుగుమిల్లి "చెత్త నుండి సంపద తయారీ కేంద్రం" గేదెల శాలగా మారిపోయిందని ప్రజల విమర్శిస్తున్నారు. ఇ క్కడ సంపద తయారీ కేంద్రం మొదట నుండి పంచాయతీ అధికారుల నిర్లక్ష్యానికి గురై వేసిన షెడ్, వర్మీ కంపోస్ట్, ఈ-వేస్ట్, తడి చెత్త పొడి చెత్త వీరు చేసే తొట్టెలు అలంకారప్రాయంగా మారాయి. దీన్ని ఆసరాగా తీసుకున్న గ్రామానికి చెందిన ఓ వైకాపా నాయకుడు సంపద తయారీ కేంద్రం షెడ్డును తన గేదెల షెడ్డుగా, గేదెలతో పాటు తన ట్రాక్టర్ కు నీడ కోసం వాడుకుంటున్న వైనమిది. ఇంతా జరుగుతున్న స్థానిక పంచాయతీ కార్యదర్శి, ఇతర సిబ్బంది ఇటువైపు కన్నెత్తి చూడటం లేదంటే సంపదనుండి చెత్త తయారీ కేంద్రం దుస్థితి ఎలా మారిపోయిందో చూస్తే అర్థమవుతుంది. సంబంధిత అధికారులు స్పందించి సంపద తయారీ కేంద్రాన్ని సంపద సృష్టించే కేంద్రంగా తీర్చిదిద్దాలని ప్రజలు కోరుతున్నారు.

## డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో ఎంపీటీసీ




**రంపచోడవరం, అక్టోబర్ 15 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):**
రంపచోడవరం మండలం తామరపల్లి పంచాయతి కొమరవరం గ్రామంలో డ్రై డే ఫ్రైడే కార్యక్రమం ముసురుమిల్లి ఎంపీటీసీ కుంజం వంశీ నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా బ్లీచింగ్ చలించి, డ్రెనేజే లో నీరు నిల్వ ఉన్న చోట యాంటీ లార్వా మందు పిచికారీ మందు చేయించారు గ్రామస్తులు నీరు సరిగ్గా రావడం లేదని, తెలుపగ అధికారులు దృష్టిలో పెట్టి మీ సమస్యను పరిష్కారనికి కృషి చేస్తానని అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ ఏం పద్మ సుహాసిని, వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఆశ కార్యకర్త తదితరులు పాల్గొన్నారు.

### సుప్రీంకోర్ట్ ప్రధాన న్యాయమూర్తిపై
## దాడిని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ నిరసన

**కాట్రేనికోన, అక్టోబర్ 17 (తెలుగురాష్ట్రం విలేఖరి):**
ఎంఆర్పీఎస్ వ్యవస్థాపకులు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ మేరకు ఆదేశాలకు మండల ఎంఆర్పీఎస్, ఎంఎస్పి అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అయిన బిఆర్ గబాయ్ పై జరిగిన పాసవికమైన దాడిని ఖండిస్తూ దాడి వెనుక



ఉన్న కుట్రదారులను వెలికి తీసి శిక్షించాలని, అలాగే కిషోర్ కుమార్ అనే వ్యక్తిని అరెస్టు చేయాలని మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు చేట్ల దుర్గారావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తాసిల్దార్ కార్యాలయం దగ్గరనిరసన కార్యక్రమం నిర్వహించి తాసిల్దార్ కు వినతిపత్రం అందజేశారు. ఈ నిరసన కార్యక్రమంలో మండల సీనియర్ ఎమ్మార్పీఎస్ నాయకులు పలివెల మోహన్ రావు, మండల ఎంఎస్పి అధ్యక్షులు సవరపు రాజు, మండల ఉప అధ్యక్షులు ఈతకోట బుచ్చిబాబు, మండల ఎమ్మార్పీఎస్ గౌరవ అధ్యక్షులు పలివెల చిన్న, చెల్లురి సుభాష్, అన్ని గ్రామాల కమిటీ అధ్యక్షులు, సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

# ఆ వాయిస్ నాది కాదు.. అది ఫేక్..
## స్పష్టం చేసిన నగర టిడిపి అధ్యక్షుడు మజ్జి రాంబాబు



**రాజమహేంద్రవరం, అక్టోబర్ 17(తెలుగురాష్ట్రం ప్రతినిధి):**
మద్యం వ్యాపారులతో మాట్లాడినట్లుగా వైరల్ అవుతున్న వాయిస్ తనది కాదని, అది ఫేక్ అని నగర టిడిపి అధ్యక్షుడు మజ్జి రాంబాబు స్పష్టం చేసారు. ఈమధ్య ఏఐతో నకిలీ వీడియోలు, వాయిస్ లు సృస్తిస్తున్నట్లు చూస్తున్నామని ఇది కూడా అలాంటిదేనని ఆయన అన్నారు. దీనిపై పోలీసులకు పిర్యాదు చేశానన్నారు. స్థానిక పాతసోమాలమ్మ పుంత రోడ్డులోని శ్రీకన్య ఇన్ లో శుక్రవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దర్యాప్తు చేస్తే వాస్తవాలు తెలుస్తాయన్నారు. మద్యం వ్యాపారులతో తాను మీటింగ్ పెట్టినట్లు నిరూపించాలని సవాల్ చేసారు. తనకు లిక్కర్ షాపులు లేవని, మద్యం వ్యాపారులతో మాట్లాడాల్సిన అవసరం లేదని, కేవలం తన ఎదుగుదలను చూసి ఓర్వలేక అడ్డుకోడానికే మాజీ ఎంపీ భరత్ ఫేక్ వీడియోలు, వాయిస్ లు చూపిస్తున్నారని, ఖబడ్దార్ భరత్ అని మజ్జి రాంబాబు అన్నారు.
గతంలో కూడా ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరిని మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు తిట్టినట్లు ఒక ఫేక్ ఆడియోను భరత్ సృష్టించారని, ఆయనకు ఇలాంటివి అలవాటేనని రాంబాబు అన్నారు. తనకు మద్యం షాపులు లేవని, ఉన్నట్లు నిరూపిస్తే రాసిస్తానని ఆయన ప్రకటించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ రాష్ట్రంలో చేస్తున్న అభివృద్ధిని ప్రజల్లోకి టీఏసుకెళ్తున్నానని, ఎమ్మెల్యే వాసు, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు అలాగే టీడీపీలోని అందరి నాయకులతో తనకు సత్సంబంధాలు ఉన్నాయని ఆయన చెప్పారు. నగరంలో బలమైన్ సామాజిక వర్గంగా ఉన్న తూర్పు కాపు సంఘం కార్యదర్శిగా చాలా ఏళ్ళు పనిచేసి, ఇపుడు అధ్యక్షుడిగా ఉన్నానని, ఎక్కడా తప్పు చేయలేదని మజ్జి రాంబాబు అన్నారు. ఇయ్యపు కూర్మారావు, రౌతు సూర్యప్రకాశరావు వంటివాళ్ళు ఉల్లిపాయల వ్యాపారం చేసి ఎదిగారని, తాను కూడా అదే వ్యాపారం చేస్తున్నానని అన్నారు. ఈ వ్యాపారాన్ని కించపరిచేలా మాట్లాడ్డం భరత్ కి తగదన్నారు. బహుశా వైసిపి సిటీ ప్రెసిడెంట్ గా భరత్ ఉండడం, అందుకు సమానమైన టిడిపి నగర అధ్యక్షుడిగా తాను ఉండడంతో తట్టుకోలేక కుట్ర చేసినట్లు ఉందని ఆయన వ్యాఖ్యానించారు. నా వెనుక ఎవరో ఉన్నారని చెప్పడం చూస్తుంటే మొత్తం టిడిపి మీద కక్షతోనే భరత్ అభియోగం చేస్తున్నట్లు అర్ధం అవుతోందని రాంబాబు అన్నారు. కావాలని కొంతమందిని కోవర్టులుగా కూటమి పార్టీల్లోకి పంపించి పబ్బం గడుపుకోవాలని భరత్ చూస్తున్నారని ఆయన ఆరోపించారు. గతంలో ప్రతిపక్షం అంటే హుందాగా ఉండేదని ఆయన సోదాహరణంగా ప్రస్తావించారు. మీడియా సమావేశంలో తెలుగుదేశం పార్టీ నాయకులు దాస్యం ప్రసాద్, ఈతలపాటి రవి, బొర్రా చిన్ని, సలాది ఆనంద్, బంగారు నాగేశ్వరరావు, యర్రంశెట్టి రాజ్ కుమార్, ఆడారి లక్ష్మీ నారాయణ, దుద్దేటి నాగేంద్ర, కడియాల వాసు, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో సిపిఆర్ పై అవగాహన కార్యక్రమం




**చింతూరు, అక్టోబర్ 17(తెలుగురాష్ట్రం విలేకరి):**
సమాజంలో అవగాహన పెంచడానికి ప్రాణాలను రక్షించే నైపుణ్యాలను పెంపొందించే ప్రయత్నంలో, 13 నుండి 17వ తేదీ వరకు చింతూరులోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సిహెచ్ సి)లో కార్డియోపల్మోనరీ రిససిటేషన్ (సిపిఆర్) అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారం రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమం ఆరోగ్య సంరక్షణ కార్మికులు, సహాయక సిబ్బంది, ఆశా కార్మికులు, విద్యార్థులు, స్థానిక నివాసితులకు సిపిఆర్ యొక్క ప్రాముఖ్యత, అత్యవసర పరిస్థితుల్లో దానిని ఎలా సమర్థవంతంగా నిర్వహించాలో అవగాహన కల్పించారు. శిక్షణ పొందిన వైద్య నిపుణుల నేతృత్వంలో రోజువారీ సి పి ఆర్ శిక్షణా సెషన్‌లు నిర్వహించారు. వయోజన, పిల్లల, శిశు సిపిఆర్ పద్ధతులపై ప్రత్యక్ష ప్రదర్శనలు నిర్వహించారు. గుండె ఆగిపోయిన కేసులలో సకాలంలో జోక్యం చేసుకోవడం యొక్క ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ చొరవకు స్థానిక సమాజం ఆరోగ్య సంరక్షణ సిబ్బంది నుండి ఉత్సాహంగా భాగస్వామ్యం లభించింది. ఈ సందర్భంగా వైద్య అధికారి మాట్లాడుతూ ప్రాణాలను కాపాడడంలో సి పి ఆర్ పరిజ్ఞానం యొక్క ప్రాముఖ్యతను చెప్పారు. ముఖ్యంగా తక్షణ వైద్య సహాయం అందుబాటులో లేని గ్రామీణ, మారుమూల ప్రాంతాలలో చాలా ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమం ప్రజలకు అవసరమైన అత్యవసర ప్రతిస్పందన నైపుణ్యాలతో సాధికారత కల్పించే విస్తృత ఆరోగ్య విద్య ప్రయత్నంలో భాగం అని అన్నారు. ఈ కార్యక్రమంలో డా కోటిరెడ్డి సూపరింటెండెంట్, డా భరద్వాజ్, డా స్పందన, డా మహేష్ పెడియాట్రిక్స్, డా రమణరావు గైనిక్, డా శశికళ గైనిక్, సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ భద్రకాళి వీరేశ్వరస్వామి దేవాలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

**పోలవరం, అక్టోబర్ 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):**
పోలవరం మండలం పట్టిసీమలో అతి పురాతనమైన శ్రీ భద్రకాళి వీరేశ్వర దేవాలయం నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారం చేశారు. పాలకమండలి చైర్మన్ గా శ్రీ రాజా కొచ్చర్లకోట వెంకట జగన్నాధరావు, సభ్యులుగా దోకల నాగేశ్వరరావు, ఎస్. విజయలక్ష్మి, ఎస్. లక్ష్మణ్ ప్రసాద్, పి. నాగభద్రం, ఎన్. హేమలత, ఎం. శ్రీనివాసరావు, ఎం. వెంకటేశ్వరరావు, కే బుజ్జి, బి.లక్ష్మి,




అర్చకులు ఆర్. సూర్య నారాయణ మూర్తిలతో, దేవాదాయ డివిజనల్ ధర్మాదాయ శాఖ ఇన్స్పెక్టర్ చల్లా, ఉదయ బాబు నాయుడు, ఆలయ ఈవో లక్ష్మి, గురువారం ప్రమాణం చేయించారు. ముందుగా వైర్మన్, కమిటీ సభ్యులు పరమశివుని దర్శించుకుని శివుని సన్నిధిలో ప్రమాణస్వీకారం చేశారు. అలాగే పోలవరం మండలంలో ఎంతో పేరుగాంచిన దేవాలయంగా శ్రీ భద్రకాళి వీరేశ్వర దేవాలయం ఉండని భక్తులు స్వామివారి దర్శనానికి అధిక సంఖ్యలో వస్తుంటారు కనుక భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రూపకలప్పన చేయాలని పాలకమండలి సభ్యలకు సూచించారు. దేవాలయ అభివృద్ధిరి పాటుపడాలని తెలిపాడు. పరవి ఆకాండ్లతో కాకుండా దేవునికి సే వచేయాలనే దృక్పదంతో ఉండాలని కోరారు. ప్రతి విదాబిలాగా శివరాత్రి ఉత్సవాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా నిర్వహించాలన్నారు. చైర్మన్ శ్రీ రాజా కొచ్చర్లకోట వెంకట జగన్నాధరావు మాట్లాడుతూ అందరిని కలుపుకొని శివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తా మన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో లక్ష్మి, పట్టిసీను గ్రామ సర్పంచ్ శ్రీరామ మూర్తి పట్టిసీమ సొసైటీ అధ్యక్షులు సున్నకాని, రాంబాబు, మరియు సభ్యులు, కొత్త పట్టిసీను సొసైటీ అధ్యక్షులు పూడి, వెంకట్రాపు మరియు సభ్యులు, టిడిపి మండల అధ్యక్షులు బొడ్డు కృష్ణ జనసేన, మండల అధ్యక్షుడు గుణవర్తి, చిన్ని, జనసేన మండల వైస్ ప్రెసిడెంట్ తెలగంశెట్టి రాంప్రసాద్, గూటలా లక్ష్మి నరసింహ స్వామి చైర్మన్ ఏ. వెంకటేశ్వరరావు, పాపోలు గణపతి రత్తయ్య కానీ, అయ్యప్ప, లోవిశెట్టి వీరబాబు, ధర్మేంద్ర, టిడిపి గ్రామ అధ్యక్షులు పూడి, సత్యనారాయణ, జనసేన వీర మహిళ నాయకురాలు స్వాతి, పేట్ల కాంట్రాక్టర్ మణికంఠ, కూటమి నాయకులు, పాల్గొన్నారు.

## పోలవరంలో అంబులెన్స్ సేవలకు అంతరాయం

**పోలవరం, అక్టోబర్ 17 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):**
పోలవరం మండలం కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో 108 అంబులెన్స్ మరమ్మత్తుల కారణంగా అందుబాటులో లేకపోవడంతో రోగులు, వైద్యులు ఇబ్బందులు పడుతున్నారు. పోలవరం నుండి రాజమండ్రి వెళ్లడానికి సమయానికి వేరే వెహికల్స్ లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో 108 అంబులెన్స్ు మరింత సేవలు అందించిందని ఇప్పుడు అంబులెన్స్ మరమ్మతులకు గురికావడంతో రోగులు వైద్యులు, ఇబ్బంది పడుతున్నారు. పేద ప్రజలు బయట కిరాయి పెట్టుకొని వెళ్లే స్తోమత లేక ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు .ప్రాణం పోయే సమయంలో అంబులెన్స్ గమ్యాన్ని చేరవేయడంలో బాగా ఉపయోగ పడుతుందని అన్నారు .పాము కాటు, శ్వాసకోశ అత్యవసర కేసులలో రోగులను రాజమండ్రికి తరలించడంలో ఆలస్యం అవుతోందని స్థానికులు ఆందోళన చెందారు. ఈ సమస్యను ఉన్నతాధికారులు త్వరగా పరిష్కరించాలని సూపర్నెంట్ పి.రాంబాబు దొర కోరారు.

## సైబర్ నేరాలు పట్ల అప్రమత్తంగా ఉండాలి
### -ఎస్సై క్రాంతి కుమార్




**జీలుగుమిల్లి, అక్టోబర్17 (తెలుగురాష్ట్రం విలేఖరి):**
సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని జీలుగుమిల్లి ఎస్ఐ క్రాంతి కుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని బర్రింకలపాడు గిరిజన బాలుర జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలు, శక్తి యాప్ అవగాహన, పోక్సో చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "సెల్‌ఫోన్లకు వచ్చే ఓటీపీలు పట్ల విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలి. సైబర్ నేరగాళ్లు ఖాతాల్లోని డబ్బును దొంగిలించేందుకు ఓటీపీలను అడిగి మోసం చేస్తారు," అని హెచ్చరించారు. అలాగే, అపరిచిత వ్యక్తులతో మొబైల్ ద్వారా మాట్లాడకూడదని, 'డిజిటల్ అరెస్టు' పేరుతో మోసాలు జరుగుతున్నాయని గుర్తు చేశారు. శక్తి యాప్ వినియోగం గురించి వివరించిన ఆయన, విద్యార్థులు గుడ్ టచ్-బ్యాడ్ టచ్ వంటి అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### జన జాగృతి రథం ద్వారా
## చట్టాలపై అవగాహన



**పి.గన్నవరం అక్టోబర్ 18 (తెలుగురాష్ట్రం విలేకరి):**
చట్టాలపై అవగాహన పెంపొందించుకొని ప్రజలంతా జాగృతం కావాలని పి.గన్నవరం యస్.ఐ బీ. శివ కృష్ణ పిలుపునిచ్చారు. డా.అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ ఇటీవల ప్రారంభించిన జన జాగృతి రథం ద్వారా చట్టాలపై అవగాహన కల్పించే కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా యస్.ఐ- పి.గన్నవరం మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రజల్లో మాదకద్రవ్యాల వాడకాన్ని నివారించే చర్యలు, సైబర్ నేరాలపై జాగ్రత్తలు, మహిళల పట్ల గౌరవంగా నడుచుకోవడం వంటి అంశాలపై ఈ రథం ద్వారా అవగాహన కల్పిస్తామని వివరించారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి చట్ట విరుద్ధమైన పనులకు దూరంగా ఉండాలని యస్.ఐ- పి.గన్నవరం తెలిపారు. డా.అంబేద్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలంలో జెడ్.పి.హెచ్.యస్ స్కూల్ నందు ఎస్సై, స్టేషన్ సిబ్బందితో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలు ఈ రథం ద్వారా అందించే సందేశాలను గమనించి, నేరాల నుండి దూరంగా ఉండాలని యస్.ఐ పిలుపునిచ్చారు.

# భారత్ ఎఫెక్ట్.. పాకిస్తాన్‌కు రూ.100 కోట్ల నష్టం..

**ఆసియా కప్ 2025 ఫైనల్లో భారత్ పాకిస్థాన్‌ను ఓడించి టైటిల్‌ను గెలుచుకుంది. టోర్నమెంట్‌లో టీమిండియా వరుసగా మూడు మ్యాచ్‌ల్లో పాకిస్థాన్‌ను ఓడించి అజేయంగా నిలిచింది. ఆసియా కప్ గెలిచినప్పటికీ, భారత జట్టు ఇంకా ట్రోఫీని గెలుచుకోలేదు. ఇంతలో, భారత క్రికెట్ నియంత్రణ మండలి ఈ టోర్నమెంట్ నుంచి గణనీయంగా లాభపడింది. రూ.100 కోట్లు సంపాదించింది. ఇంతమంది ప్రేక్షకులు వస్తారని ఊహించని పాకిస్తాన్‌కు ఇది గణనీయమైన దెబ్బ తగిలింది.**





### బీసీసీఐ అంత డబ్బు ఎలా సంపాదించింది?

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో జరిగిన ఆసియా కప్ బీసీసీఐ గణనీయమైన ఆదాయాన్ని ఆర్జించింది. TOI నివేదికల ప్రకారం, అంతర్జాతీయ పర్యటన భారత బోర్డుకు సుమారు రూ.109.04 కోట్లు (సుమారు $1.09 బిలియన్) లాభాన్ని ఆర్జించింది. ఈ ఆదాయం ఐసీసీ టీ20ఐ ప్రపంచ కప్‌ను నిర్వహించే ఫీజులు, టీవీ హక్కులు, పాల్గొనడం ద్వారా వస్తుంది. బోర్డు మీడియా హక్కుల ద్వారా రూ. 138.64 కోట్లు (సుమారు $1.38 బిలియన్) అందుకుంది. ఆసియా కప్‌లో భారతదేశం పాకిస్తాన్‌తో మూడు మ్యాచ్‌లు ఆడింది. దీంతో గణనీయమైన ఆదాయానికి ఇది ప్రధాన కారణం.

నివేదికల ప్రకారం, 2025-26 సంవత్సరానికి బీసీసీఐ వార్షిక బడ్జెట్ ఈ సంవత్సరం బోర్డు సుమారు రూ. 6,700 కోట్ల ఆదాయాన్ని ఆర్జించగలదని సూచిస్తుంది. ఇండియన్ ప్రీమియర్ లీగ్ విలువ వరుసగా రెండవ సంవత్సరం తగ్గినప్పటికీ, బీసీసీఐ ఆర్థిక స్థితి బలంగా ఉంది.

### ఐపీఎల్ కారణంగా నష్టపోయిన బీసీసీఐ..

భారత క్రికెట్ నియంత్రణ మండలి ఆదాయం ప్రతి సంవత్సరం పెరుగుతున్నప్పటికీ, ఐపీఎల్ వల్ల అది గణనీయమైన నష్టాలను చవిచూస్తోంది. నివేదికల ప్రకారం, 2025లో ఐపీఎల్ విలువ రూ. 76,100 కోట్లుగా అంచనా వేసింది. ఇది గత సంవత్సరం రూ. 82,700 కోట్ల నుంచి గణనీయంగా తగ్గింది. దీని ఫలితంగా బీసీసీఐకి దాదాపు రూ. 6,600 కోట్ల నష్టం వాటిల్లింది.

ఇంతలో, ఆసియా కప్ గెలిచినప్పటికీ, టీం ఇండియా ఇంకా ట్రోఫీని అందుకోలేదు.

ఆసియా క్రికెట్ కౌన్సిల్, పాకిస్తాన్ క్రికెట్ బోర్డు అధ్యక్షుడు మొహ్సిన్ నఖ్వీ పట్టుదల కారణంగా, ఆసియా కప్ ట్రోఫీ ఏసీసీ కార్యాలయంలోనే ఉంది. కానీ, ఆసియా కప్ నుంచి బీసీసీఐ సంపాదించకుండా మొహ్సిన్ నఖ్వీ ఆపలేకపోయాడు.

# తొక్కిసలాట తర్వాత కర్ణాటక కేబినెట్ కీలక నిర్ణయం..

## రూ.2350 కోట్లతో ఇంటర్నేషనల్ స్టేడియం



**రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఐపీఎల్ విజయోత్సవాల సందర్భంగా జరిగిన తొక్కిసలాట సంఘటన తరువాత, బెంగళూరులోని ఎం.చిన్నస్వామి అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం సామర్థ్యం, భద్రతపై తీవ్ర అనుమానాలు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య నేతృత్వంలో గురువారం (అక్టోబర్ 16) జరిగిన కర్ణాటక మంత్రివర్గం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. బెంగళూరు నగరంలో అంతర్జాతీయ స్థాయి క్రికెట్ స్టేడియం, క్రీడా సముదాయం నిర్మాణానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది.**

బెంగుళూరు జిల్లాలోని ఆనేకల్ తాలూకాలో ఈ భారీ ప్రాజెక్టును నిర్మించనున్నారు. సుమారు రూ.2,350 కోట్ల అంచనా వ్యయంతో అంతర్జాతీయ స్థాయి క్రికెట్ స్టేడియం, క్రీడా సముదాయాన్ని నిర్మించడానికి మంత్రి వర్గం గురువారం ఆమోదిం చింది. ఈ వివరాలను సమావేశానంతరం మంత్రి హెచ్.కె. పాటిల్ వెల్లడిం చారు. ఇండ్లవాడి గ్రామంలోని సూర్యనగర్ నాల్గవ దశ విస్తరణలో మొత్తం 75 ఎకరాల విస్తీర్ణంలో ఈ స్టేడియం నిర్మించాలని గృహనిర్మాణ శాఖ ప్రతిపాదించింది. దీనికి కేబినెట్ ఆమోదం తెలిపింది. కర్ణాటకలో మైసూర్, తుమకూరులలో నిర్మాణంలో ఉన్న స్టేడియంల తర్వాత, ఇది రాష్ట్రంలో మూడవ అంతర్జాతీయ స్టేడియం కానుంది. గృహనిర్మాణ శాఖ మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్ ఈ ప్రాజెక్టు వివరాలను వెల్లడించారు. కొత్తగా నిర్మించబోయే ఈ స్టేడియం 80,000 మంది ప్రేక్షకుల కెపాసిటీ కలిగి ఉంటుంది. అంతేకాకుండా, ఇది 24 ఇండోర్, అవుట్‌డోర్ క్రీడలకు అవసరమైన సౌకర్యాలను కలిగి ఉంటుంది. అదనంగా 3,000 సీట్ల కెపాసిటీ గల ఒక అసెంబ్లీ హాల్ కూడా నిర్మించనున్నారు. ఇంటర్నేషనల్ లెవల్ సౌకర్యాలతో ఇది దేశంలోనే అతి పెద్ద క్రీడా సముదాయాల్లో ఒకటిగా నిలవనుంది. బెంగుళూరులో ప్రస్తుతం ఉన్న ఎం. చిన్నస్వామి స్టేడియం కేవలం 38,000 మంది ప్రేక్షకులను మాత్రమే అనుమతించగలదని గృహనిర్మాణ శాఖ డాక్యుమెంట్లు పేర్కొంటున్నాయి. చిన్న నగరాలు కూడా దీనికంటే పెద్ద స్టేడియంలను కలిగి ఉన్నాయని ప్రభుత్వం గుర్తించింది. ఇటీవల రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఐపీఎల్ గెలుపు తర్వాత జరిగిన తొక్కిసలాటలో 11 మంది మరణించిన సంగతి తెలిసిందే. ఈ సంఘటన తరువాత చిన్నస్వామి స్టేడియంలో ఇంటర్నేషనల్ మ్యాచులు జరుగలేదు. ఈ ఘటన, స్టేడియం కెపాసిటీ పై ఉన్న ఆందోళనల కారణంగానే ప్రభుత్వం ఈ కొత్త, పెద్ద స్టేడియం నిర్మాణానికి చొరవ తీసుకుంది. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు కోసం డీపీఆర్, ఫీసబిలిటీ స్టడీ రెడీ చేయాలని సంబంధిత శాఖను మంత్రివర్గం ఆదేశించింది.

# ఫైనల్‌కు భారత్

## నేడు టైటిల్‌కై ఆస్ట్రేలియాతో మ్యాచ్ సుల్తాన్ జొహెూర్ కప్



కౌలాలంపూర్: సుల్తాన్ జొహెూర్ కప్ ఫైనల్లోకి భారతజట్టు ప్రవేశించింది. గురువారం జరిగిన ఉత్కంఠభరిత చివరి గ్రూప్ లీగ్ మ్యాచ్‌లో భారత హాకీ జట్టు 2-1గోల్స్ తేడాతో మలేషియాను చిత్తుచేసింది. హెూరాహెూరీగా సాగిన ఈ మ్యాచ్‌లో తొలి క్వార్టర్‌లో ఇరుజట్లు గోల్స్ చేయలేదు. రెండో క్వార్టర్‌లో గురుజ్యోత్ సింగ్(22వ ని.)లో ఒక గోల్ కొట్టి భారత్‌ను 1-0 ఆధిక్యతలో నిలిపాడు. ఆ తర్వాత ఇరుజట్లు గోల్స్ చేయడంలో విఫలమయ్యాయి. మూడో క్వార్టర్ ముగుస్తుందనగా మలేషియా తరఫున నవ్‌నీష్ పనిక్కర్(43వ ని.)లో ఒక గోల్ చేయడంలో స్కోర్ 1-1తో సమమైంది. నాల్గో, చివరి క్వార్టర్ ప్రారంభంలోనే 48వ ని.లో సౌరభ్ ఆనంద్ గోల్ కొట్టి భారత్‌కు విజయాన్ని ఖాయం చేశాడు. ఈ టోర్నీలో భారత జట్టు జూనియర్ హాకీ జట్టును బరిలోకి దింపినా.. బలమైన ఆతిథ్య మలేషియాను చిత్తుచేయడం విశేషం. ముఖ్యంగా రెండో క్వార్టర్‌లో ఆతిథ్య జట్టు భారత్ గోల్ పోస్ట్‌పై పలుమార్లు దాడులు చేసినా.. గోల్ కీపర్ సమర్ధవంతంగా అడ్డుకున్నాడు. ఆదివారం జరిగే ఫైనల్లో భారతజట్టు ఆస్ట్రేలియాతో తలపడనుంది. 3, 4 స్థానాలకు బ్రిటన్, పాకిస్తాన్ 5, 6 బెర్త్‌లకు మలేషియా, న్యూజిలాండ్ జట్లు తలపడనున్నాయి.

# భారత క్రికెట్ సంఘం అధ్యక్షురాలిగా శాంతా రంగస్వామి



ముంబయి: భారత మహిళల జట్టు మాజీ కెప్టెన్ శాంతా రంగస్వామికి కీలక పదవి లభించింది. శుక్రవారం జరిగిన ఎన్నికల్లో భారత క్రికెట్ సంఘం అధ్యక్షు రాలిగా రంగస్వామి ఎన్నికయ్యారు. ఢిల్లీ మాజీ ఓపెనర్ వెంకట్ సుందరం కార్య దర్శిగా.. దీపక్ జైన్ కోశాధికారిగా, జ్యోతి థాటే, సంతోష్ సుబ్రమణియన్‌లు ఐసిఎ ప్రతినిధులుగా ఎంపికయ్యారు. బిసిసిఐ అపెక్స్ కౌన్సిల్‌లో ఐసిఎ ప్రతి నిధిగా మాజీ కెప్టెన్ సుధా షా, ఐపిఎల్ పాలక మండిలిలో ప్రతినిధిగా శుభాంగి కులకర్ణిలకు బాధ్యతలు అప్పగించారు. పురుషుల విభాగం నుంచి బిసిసిఐ అపెక్స్ కౌన్సిల్‌కు ఛాముండేశ్వరనాథ్ ఎంపికయ్యారు. చెన్నైలో జన్మించిన రంగస్వామి భారత క్రికెట్‌లో దిగ్గజ ప్లేయర్. మహిళల జట్టుకు తొలి కెప్టెన్‌గా ఎంపికైన ఆమె.. మొట్టమొదటి టెస్టులో వెస్టిండీస్‌పై విజయాన్ని అందించారు. ఆల్‌రౌండర్ అయిన రంగస్వామి 1976 నుంచి 1991 మధ్య కాలంలో ఇండియాకు ప్రాతినిధ్యం వహించారు. కెరీర్‌లో 16 టెస్టులు మాత్రమే ఆడిన ఆమె.. న్యూజిలాండ్‌పై చరిత్రాత్మక విజయంలో భాగమయ్యారు. ఎనిమిది మ్యాచ్‌లకు కెప్టెన్‌గా వ్యవహరించిన ఆమె మొత్తంగా సుదీర్ఘ ఫార్మాట్‌లో 32.60 సగటుతో 750 పరుగులు, 21 వికెట్లు పడగొట్లారు. మహిళా క్రికెట్‌కు విశేష సేవలందించిన ఆమెకు 1976లో అర్జున అవార్డు లభించింది.

# 2027 వన్డే వరల్డ్ కప్‌లో రోహిత్ - కోహ్లీ ఆడతారని భావిస్తున్నా: హెడ్

ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌తో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ తిరిగి మైదానంలోకి అడుగుపెడుతున్నారు. దీంతో అందరి కళ్లూ వారిపైనే ఉన్నాయి. దాదాపు ఆరేడు నెలల తర్వాత వన్డే మ్యాచ్‌లు ఆడేందుకు స్టార్లు ఇద్దరూ సిద్ధమయ్యారు. ఆస్ట్రేలియాతో ఆదివారం మొదటి మ్యాచ్ జరగనుంది. భారత్ నుంచి అక్షర్ పటేల్.. ఆసీస్ తరఫున ట్రావిస్ హెడ్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రో-కో వచ్చే వన్డే ప్రపంచ కప్‌లో ఆడతారని భావిస్తున్నట్లు హెడ్ వ్యాఖ్యానించాడు. దీనికి అక్షర్ పటేల్ సమాధానం ఇచ్చాడు.

### అప్పటి ఫొటోలు వైరల్ కావడంతోనే రోహిత్ ఇలా..: అభిషేక్ నాయర్

"రోహిత్, విరాట్ భారత్ కోసం అద్భుతాలు చేశారు. నా కంటే అక్షర్ పటేల్ బాగా చెప్పగలడు. ఇద్దరూ ప్రపంచ క్రికెట్‌లో అత్యుత్తమ ప్లేయర్లు. వారిని ఒకరితో మరొకరిని పోల్చడం సరికాదు. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో దూకుడుగా ఓపెనింగ్ చేసే రోహిత్ అంటే నాకు చాలా గౌరవం. అయితే, వారిద్దర్నీ ఏదొక స్టేజ్‌లో మిస్ అవుతామని తెలుసు. కానీ, 2027 వన్డే ప్రపంచ కప్‌లో ఆడేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఉన్నారు. తప్పకుండా ఆడతారని భావిస్తున్నా. దాని వల్ల ఆట మరింత గొప్పగా మారుతుంది" అని హెడ్ తెలిపాడు.



### తప్పకుండా ఆడతారు: అక్షర్

"రోహిత్, విరాట్ ప్రపంచ స్థాయి అత్యుత్తమ ప్లేయర్లు. ఏం చేయాలో వారికి బాగా తెలుసు. తప్పకుండా సిద్ధంగా ఉంటారు. ఒకవేళ వారి ఫామ్ గురించి మాట్లాడాలనుకుంటే.. అందుకు వారూ రెడీ. ఇప్పటికే ఫిట్‌నెస్ టెస్టులోనూ పాస్ అయిపోయారు. ఫామ్‌లోకి రావడం వారికేమీ కొత్త కాదు" అని అక్షర్ వ్యాఖ్యానించాడు.

# భారత్‌తో వన్డే సిరీస్ మొదలుకాక ముందే ఆస్ట్రేలియాకు షాక్..

## గాయంతో సిరీస్ నుంచి స్టార్ ప్లేయర్ ఔట్



**భారత్, ఆస్ట్రేలియా మధ్య వన్డే సిరీస్ ప్రారంభం కావడానికి సరిగ్గా రెండు రోజుల ముందు ఆస్ట్రేలియా జట్టుకు ఒక పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. ఆల్‌రౌండర్ కేమరూన్ గ్రీన్ గాయం కారణంగా ఈ వన్డే సిరీస్ మొత్తం నుంచి వైదొలిగాడు. కండరాల పట్టేయడం కారణంగా అతడు ఈ సిరీస్‌కు దూరమయ్యాడు. అయితే, అతడి స్థానంలో మరొక స్టార్ బ్యాట్స్‌మెన్ మార్నస్ లబుషేన్?కు ఆస్ట్రేలియా వన్డే జట్టులో చోటు దక్కింది. కేమరూన్ గ్రీన్ కండరాల పట్టేయడం కారణంగా భారత్‌తో జరిగే ఈ వన్డే సిరీస్‌కు దూరం అయ్యాడు. ఈ నిర్ణయం వెనుక ముఖ్య కారణం ఏమిటంటే.. వచ్చే నెలలో ప్రారంభం కానున్న ప్రతిష్టాత్మక యాషెస్ సిరీస్?కు ముందు సెలక్టర్లు ఎటువంటి రిస్క్ తీసుకోవడానికి ఇష్టపడలేదు. ఆస్ట్రేలియా టీం ఒక ప్రకటనలో.. "కేమరూన్ గ్రీన్ కొంతకాలం రిహాబిలిటేషన్ పూర్తి చేస్తాడు. ఆ తర్వాత యాషెస్ సిరీస్‌కు సిద్ధమయ్యేందుకు షెఫీల్డ్ షీల్డ్ మూడవ రౌండ్‌లో ఆడటానికి ప్రయత్నిస్తాడు" అని తెలిపింది.**

కేమరూన్ గ్రీన్ స్థానంలో ఆస్ట్రేలియా వన్డే జట్టులో మార్నస్ లబుషేన్ చోటు దక్కించుకున్నాడు. లబుషేన్ గురువారం క్వీన్స్‌లాండ్ తరఫున షెఫీల్డ్ షీల్డ్ మ్యాచ్‌లో 159 పరుగులతో అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. దేశవాళీ సీజన్‌లో ఇది మార్నస్ లబుషేన్‌కు నాలుగవ సెంచరీ కావడం విశేషం. 31 ఏళ్ల లబుషేన్ ఇప్పటివరకు 66 అంతర్జాతీయ వన్డే మ్యాచ్‌లు ఆడి, 34.64 సగటు, 83.56 స్ట్రైక్ రేట్‌తో 1871 పరుగులు చేశాడు.

మార్నస్ లబుషేన్ భారత్‌పై కూడా అద్భుతమైన ప్రదర్శన కనబరిచాడు. అతను భారత్‌పై ఇప్పటివరకు 15 వన్డే మ్యాచ్‌లు ఆడి, 13 ఇన్నింగ్స్‌లలో 474 పరుగులు చేశాడు. ఇందులో 4 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. గత ఏడాది 2023 ప్రపంచ కప్ ఫైనల్‌లో కూడా మార్నస్ లబుషేన్ 58 పరుగుల కీలక ఇన్నింగ్స్ ఆడి ఆస్ట్రేలియా గెలుపులో కీలక పాత్ర పోషించాడు. దీంతో గ్రీన్ స్థానంలో లబుషేన్ రాక భారత జట్టుకు అంత తేలికైన విషయం కాదని తెలుస్తోంది.

### భారత్, ఆస్ట్రేలియా మధ్య మూడు వన్డే మ్యాచ్‌ల సిరీస్ షెడ్యూల్:

**మొదటి వన్డే: అక్టోబర్ 19 (పెర్త్)**
**రెండవ వన్డే: అక్టోబర్ 23 (అడిలైడ్)**
**మూడవ వన్డే: అక్టోబర్ 25 (సిడ్నీ)**

ఈ మూడు మ్యాచ్‌లు భారత సమయం ప్రకారం ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయి. 8:30 గంటలకు టాస్ పడుతుంది. భారత వన్డే జట్టు: శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్ (ఉప-కెప్టెన్), అక్షర్ పటేల్, కేఎల్ రాహుల్ (వికెట్ కీపర్), నితీష్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, హర్షిత్ రాణా, మొహమ్మద్ సిరాజ్, అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ, ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్), యశస్వి జైస్వాల్.ఆస్ట్రేలియా వన్డే జట్టు: మిచెల్ మార్ష్ (కెప్టెన్), జేవియర్ బార్ట్‌లెట్, అలెక్స్ కారీ, కూపర్ కోనొలీ, బెన్ ద్వార్షుయిస్, నాథన్ ఎల్లిస్, మార్నస్ లబుషేన్, జోష్ హాజిల్‌వుడ్, ట్రావిస్ హెడ్, మిచెల్ ఓవెన్, మాట్ రెన్‌షా, మాథ్యూ షార్ట్, మిచెల్ స్టార్క్, మాథ్యూ కునేమన్, జోష్ ఫిలిప్.

తెలుగురాష్ట్రం దినపత్రిక



# బాహుబలి ది ఎపిక్' సెన్సార్ పూర్తి..

- కొత్త వెర్షన్ నిడివి ఇదే!
- 'బాహుబలి: ది ఎపిక్' పేరుతో సింగిల్ పార్ట్‌గా రెండు సినిమాలు
- సెన్సార్ పూర్తి.. %ఖ/ూ% సర్టిఫికెట్ జారీ
- ఫైనల్ అయిన రన్‌టైమ్.. 3 గంటల 44 నిమిషాలు
- కొన్ని పాత సీన్లకు కత్తెర.. చేరనున్న కొత్త సన్నివేశాలు
- ఈ నెల 31న గ్రాండ్ రిలీజ్.. 29న యూఎస్‌లో ప్రీమియర్లు

భారతీయ సినిమా చరిత్రలో ఒక సంచలనం సృష్టించిన 'బాహుబలి' మళ్లీ ప్రేక్షకుల ముందుకు సరికొత్త రూపంలో రాబోతోంది. రెండు భాగాలుగా వచ్చిన ఈ సినిమాను ఇప్పుడు 'బాహుబలి: ది ఎపిక్' పేరుతో ఒకే చిత్రంగా విడుదల చేయనున్నారు. ఈ కొత్త వెర్షన్ రన్‌టైమ్‌పై నెలకొన్న ఉత్కంఠకు తెరదించుతూ, మేకర్స్ అధికారికంగా వివరాలు ప్రకటించారు. ఇటీవలే సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రానికి %ఖ/ూ% సర్టిఫికెట్ లభించింది. రెండు భాగాలను కలిపి రూపొందించిన ఈ సింగిల్ వెర్షన్ నిడివిని 3 గంటల 44 నిమిషాలుగా ఖరారు చేసినట్లు చిత్ర బృందం సోషల్ మీడియా ద్వారా వెల్లడించింది. దీంతో ఇటీవలి కాలంలో అత్యధిక రన్‌టైమ్ ఉన్న భారతీయ చిత్రాల్లో ఒకటిగా 'బాహుబలి: ది ఎపిక్' నిలవనుంది. వాస్తవానికి 'బాహుబలి' రెండు భాగాల మొత్తం నిడివి 5 గంటల 27 నిమిషాలు. అయితే 'ది ఎపిక్' కోసం దాదాపు గంటన్నరకు పైగా నిడివిని తగ్గించారు. దీనికోసం మేకర్స్ ప్రత్యేకంగా ఎడిటింగ్ చేశారు. ఒరిజినల్ వెర్షన్లలోని కొన్ని సన్నివేశాలను తొలగించి, అప్పట్లో విడుదల చేయని కొన్ని కొత్త సన్నివేశాలను జోడించినట్లు తెలుస్తోంది. అయితే ఏ సీన్లను తొలగించారు, ఏవి కొత్తగా చేర్చారనేది మాత్రం సినిమా చూసే తెలుసుకోవాలని మేకర్స్ సస్పెన్స్ కొనసాగిస్తున్నారు. 2౦౦'బాహుబలి: ది బిగినింగ్' విడుదలై పదేళ్లు పూర్తయిన సందర్భంగా ఈ సరికొత్త వెర్షన్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ చిత్రం అక్టోబర్ 31న భారత్‌లో విడుదల కానుండగా, రెండు రోజుల ముందే అంటే అక్టోబర్ 29నే యూఎస్‌లో ప్రీమియర్ షోలు ప్రదర్శించనున్నారు. రాజమౌళి సృష్టించిన ఈ దృశ్య కావ్యం సరికొత్త ఎడిటింగ్‌తో ప్రేక్షకులకు ఎలాంటి అనుభూతిని ఇస్తుందో చూడాలి.

# నాగార్జున సినిమాలో మరో హీరోయిన్ ఫిక్స్!

**తెరకెక్కనున్న న్నాగార్జున 100వ చిత్రం**
**ఇప్పటికే టబును ఖరారు చేసినట్లు సమాచారం**
**మరో హీరోయిన్ కోసం అనుష్కతో చర్చలు**



కింగ్ అక్కినేని నాగార్జున తన కెరీర్‌లో ఓ కీలక మైలురాయికి చేరువవుతున్నారు. ఆయన 100వ సినిమాపై టాలీవుడ్‌లో ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును కొత్త దర్శకుడు ఆర్ కార్తీక్ భారీ స్థాయిలో తెరకెక్కించనున్నట్లు తెలుస్తోంది. తాజా సమాచారం ప్రకారం, ఈ చిత్రంలో నాగార్జున సరసన ఇద్దరు స్టార్ హీరోయిన్లు నటించనున్నట్లు గట్టిగా ప్రచారం జరుగుతోంది. సీనియర్ నటి టబుతో పాటు స్వీటీ అనుష్క శెట్టి కూడా ఈ సినిమాలో భాగం కానున్నారని వార్తలు వస్తున్నాయి. ఈ సినిమాకు 'లాటరీ కింగ్' అనే టైటిల్ ప్రచారంలో ఉంది. ఈ సినిమా పూర్తిస్థాయి పొలిటికల్ డ్రామాగా ఉండబోతోందని, ముఖ్యమంత్రి పదవి చుట్టూ కథనం సాగుతుందని ఇండస్ట్రీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. అంతేకాదు, ఈ చిత్రంలో నాగార్జున ద్విపాత్రాభినయం చేయనున్నారని కూడా అంటున్నారు. ప్రధాన హీరోయిన్ పాత్ర కోసం మొదట నయనతారను సంప్రదించినా, చివరికి టబును ఖరారు చేసినట్లు సమాచారం. ఇప్పుడు మరో కీలకమైన పాత్ర కోసం అనుష్క శెట్టితో చిత్రబృందం చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. ఇదే నిజమైతే, చాలా కాలం తర్వాత నాగార్జున, టబు, అనుష్కలను ఒకే సినిమాలో చూసే అవకాశం ప్రేక్షకులకు దక్కుతుంది. ఈ సినిమాకు సంబంధించి మరో ఆసక్తికరమైన విషయం బయటకు వచ్చింది. ఈ చిత్రంలో నాగార్జున కుమారులు నాగచైతన్య, అఖిల్ కూడా ప్రత్యేక అతిథి పాత్రల్లో కనిపించనున్నారని చెబుతున్నారు. ఒకే సినిమాలో అక్కినేని కుటుంబానికి చెందిన ముగ్గురు హీరోలు కనిపిస్తే అభిమానులకు పండగే అని చెప్పొచ్చు. ఈ వార్తలపై త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడనుందని సమాచారం.

# కీర్తి, విజయ్ సినిమా స్పెషల్ పోస్టర్

కీర్తి సురేష్, విజయ్ దేవరకొండ కాంబినేషన్లో ఓ సినిమా రాబోతున్న సంగతి తెలిసిందే. దిల్ రాజు నిర్మాణంలో వస్తున్న ఈ సినిమాను రవికిరణ్ కోలా డైరెక్ట్ చేస్తున్నారు. శుక్రవారం కీర్తి సురేష్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా నుండి తాజాగా స్పెషల్ పోస్టర్‌ను విడుదల చేశారు. పోస్టర్‌పై 'ఆమె ప్రేమ ఓ కావ్యం లాంటిది. ఆమె ఆత్మ ఒక పాట లాంటిది' అని రాశారు.




# 'ఊ అంటావా' పాట... ఒక ఛాలెంజ్‌గా చేశా..

- తన వ్యక్తిగత జీవితం అంతా బహిరంగమేనన్న సమంత
- బలహీనంగా కనిపిస్తే నిరంతరం ట్రోలింగ్ చేస్తుంటారని వ్యాఖ్యలు
- యువత మెంటార్స్‌ను జాగ్రత్తగా ఎంచుకోవాలని సూచన
- ఎన్డీటీవీ వరల్డ్ సమ్మిట్ 2025లో మాట్లాడిన నటి



ప్రముఖ నటి సమంత రూత్ ప్రభు తన కెరీర్, వ్యక్తిగత జీవితంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా 'పుష్ప: ది రైజ్' చిత్రంలో అల్లు అర్జున్‌తో కలిసి ఆమె చేసిన 'ఊ అంటావా' పాట దేశవ్యాప్తంగా ఎంతటి సంచలనం సృష్టించిందో తెలిసిందే. అయితే ఆ పాటను తాను ఎందుకు చేయాల్సి వచ్చిందో సమంత తాజాగా వెల్లడించారు. అదొక సవాలుగా స్వీకరించి ఆ పాటలో నటించినట్లు తెలిపారు. ఇటీవల జరిగిన 'ఎన్డీటీవీ వరల్డ్ సమ్మిట్ 2025'లో పాల్గొన్న సమంత పలు విషయాలపై మాట్లాడారు. ఈ సందర్భంగా 'ఊ అంటావా' పాట ప్రస్తావన రాగా, ""ఆ పాటను నేనొక ఛాలెంజ్‌గా తీసుకుని చేశాను. నేను చేయగలనో లేదో చూసుకోవాలనుకున్నాను. నన్ను నేను ఎప్పుడూ సెక్సీగా భావించలేదు. నాకు ఎవరూ బోల్డ్ పాత్రలు ఇవ్వరని తెలుసు. అందుకే ఒక్కసారి ప్రయత్నించాను" అని సమంత వివరించారు. అదే సమయంలో, తన వ్యక్తిగత జీవితంలో ఎదుర్కొన్న సవాళ్లు, వాటివల్ల ఎదురైన ఇబ్బందుల గురించి కూడా ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. "నా ప్రయాణాన్ని గమనిస్తున్న ప్రతి ఒక్కరికీ నా వ్యక్తిగత ఇబ్బందుల గురించి తెలుసు. నా విడాకులు, అనారోగ్యం.. ఇలా ప్రతీది ప్రజల ముందు ఉంది. మనం బలహీనంగా కనిపించినప్పుడు నిరంతరం జడ్జ్ చేస్తారు, ట్రోల్ చేస్తారు" అని ఆమె తన బాధను పంచుకున్నారు. అంతేకాకుండా, యువతకు ఆశయాలు ఉండాలని, అయితే ఆ ఆశయాలకు ఒక ఉద్దేశం కూడా జతకావాలని సమంత సూచించారు. "నాకు ఆశయాలు ఎక్కువ. యువత తమ మెంటార్స్‌ను చాలా జాగ్రత్తగా ఎంచుకోవాలి. నా జీవితాన్ని మార్చేసిన మెంటార్స్‌ను నేను జాగ్రత్తగా ఎంచుకున్నాను. అందుకే ఉన్నత స్థానాల్లో ఉన్నవారు కూడా బాధ్యతగా ఉండాలి" అని సమంత పేర్కొన్నారు. కాగా, ఆమె చివరిసారిగా 2024లో విడుదలైన 'సిటాడెల్: హనీ బన్నీ' వెబ్ సిరీస్‌లో కనిపించారు.




# 7న 'జటాధర' విడుదల

%కథానాయకుడు సుధీర్‌బాబు నటించిన సినిమా 'జటాధర'. ఈ చిత్రాన్ని తెలుగు, హిందీ భాషల్లో నవంబర్ 7న నిర్మాతలు విడుదల చేయనున్నారు. బాలీవుడ్ కథానాయిక సోనాక్షి సిన్హా నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్ ట్రెండింగ్‌లో ఉన్నాయి. కథానాయకుడు మహేష్‌బాబు చేతుల మీదుగా ట్రైలర్ విడుదలైన విషయం తెలిసిందే. ఈ సినిమాకు వెంకటేష్ కళ్యాణ్- అభిషేక్ జైస్వాల్ దర్శకత్వం వహించారు. జీ స్టూడియోస్-ప్రేరణ అరోరా సంయుక్తంగా నిర్మిస్తున్నారు. నమ్రతా సిస్టర్ శిల్పా శిరోద్కర్ ఇందులో కీలకపాత్రలో నటించారు.

# 'సామ్రాజ్యం' ప్రోమో వదిలిన ఎన్టీఆర్..

## చివర్లో శింబు ఊహించని డైలాగ్!

**కోలీవుడ్‌లో శింబు, వెట్రిమారన్ కాంబోలో 'అరసన్' చిత్రం**
**తెలుగులో 'సామ్రాజ్యం' పేరుతో రానున్న సినిమా**
**చిత్ర తెలుగు ప్రోమోను విడుదల చేసిన జూనియర్ ఎన్టీఆర్**






"నా కథను ఎన్టీఆర్‌తో తీయించండి.. ఆయనైతే కుమ్మేస్తాడు" అంటూ ఓ తమిళ హీరో తన సినిమాలో చెప్పిన డైలాగ్ ఇప్పుడు సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. ఆసక్తికరంగా, ఈ డైలాగ్ ఉన్న సినిమా ప్రోమోను స్వయంగా యంగ్ టైగర్ ఎన్టీఆరే విడుదల చేయడం విశేషం. ఇంతకీ ఆ సినిమా ఏంటంటే.. కోలీవుడ్ స్టార్ శింబు, జాతీయ అవార్డు గ్రహీత, దర్శకుడు వెట్రిమారన్ కాంబినేషన్‌లో రూపొందుతున్న 'అరసన్'. ఈ చిత్రాన్ని తెలుగులో 'సామ్రాజ్యం' పేరుతో ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఈ సినిమాకు సంబంధించిన దాదాపు 4 నిమిషాల నిడివి ఉన్న తెలుగు ఇంట్రో ప్రోమోను జూనియర్ ఎన్టీఆర్ ఈరోజు తన సోషల్ మీడియా ఖాతా ద్వారా విడుదల చేసి, చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఉత్తర చెన్నై నేపథ్యంలోని గ్యాంగ్‌స్టర్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమా ప్రోమో ఆద్యంతం అద్భుతంగా ఉంది. ఓ హత్య కేసులో నిందితుడిగా కోర్టుకు వచ్చిన హీరో, జడ్జి ముందు అమాయకంగా నటిస్తూనే, మరోవైపు ముగ్గురిని దారుణంగా నరికివేసే సన్నివేశాలు సినిమాపై అంచనాలను పెంచుతున్నాయి. దీనికి అనిరుధ్ అందించిన నేపథ్య సంగీతం మరింత బలాన్నిచ్చింది. ఈ ప్రోమోలో 'జైలర్' దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ కనిపించడం కూడా ఓ ఆకర్షణగా నిలిచింది. అయితే, అందరి దృష్టిని ఆకర్షించిన అసలు విషయం ప్రోమో చివర్లో ఉంది. మీడియా ప్రతినిధులు తన కథ గురించి అడగ్గా, శింబు చెప్పిన "నా స్టోరీని ఎవరితో చేయిద్దామనుకుంటున్నారు.. ఎన్టీఆర్‌తో చేయించండి కుమ్మేస్తాడు" అనే డైలాగ్ ఇప్పుడు సంచలనం సృష్టిస్తోంది. ఈ అనూహ్యమైన డైలాగ్‌తో ఎన్టీఆర్ అభిమానులు ఫుల్ ఖుషీ అవుతూ, ఈ ప్రోమోను విపరీతంగా షేర్ చేస్తున్నారు.

TELUGU RASTRAM . Printed, Published and Owned by A.RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: A.RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339